Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 156 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 జూన్ 2023 మంగళవారం పేజీలు : 4

## బంగారం కొనాలనుకుంటున్నారా?

బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ఒకరకంగా ఇది శుభవార్తే నని చెప్పాలి. ఎందుకంటే బంగారం ధర ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేం. అయితే రెండు రోజుల పాటు స్థిరంగా ఉన్న మీదట.. గత రెండు రోజులుగా అంతో ఇంతో పసిడి ధర తగ్గుతోంది. ఇదొక పెద్ద తగ్గడం కాకున్నా.. పెరగడం లేదు కాబట్టి పెళ్లిళ్ల వేళ శుభవార్తే. బుధ, గురువారాల్లో కలిపి 10 గ్రాముల బంగారంపై రూ. 280 తగ్గింది. నేడు 22 క్యారెట్ల బంగారం ధర రూ.47,660గా ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,030గా ఉంది. కాగా.. దేశంలో ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. వెండి కేజీ ధర రూ.57,600గా ఉంది.

# రాష్ట్రంలో రెట్టింపైన తలసరి ఆదాయం

## లూలు గ్రూప్ కార్యకలాపాల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలసరి ఆదాయం రెట్టింపయిందని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతున్నదని చెప్పారు. వరిసాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో లూలూ గ్రూప్ రాష్ట్రంలో కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లూలూ సంస్థ పెట్టుబడులతో టూరిజం పెరుగుతుందని భావిస్తున్నామన్నారు. తెలంగాణలో పండే పత్తి దేశంలోనే అత్యున్నతమైనదని చెప్పారు. చేపల ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో అతిపెద్ద ఆక్వా హబ్ సిద్ధమవుతున్నదని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నదని వెల్లడించారు. రూ.300 కోట్లతో మెగా డెయిరీ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఐదేండ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 10 వేల ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ ఆచరిస్తున్నది.. దేశం అనుసరిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణలో రూ.3500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు లూలూ గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ చెప్పారు. ఫుడ్‌ప్రాసెసింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటుచేయబోతున్నామని వెల్లడించారు. రూ.3 వేలకోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో షాపింగ్‌మాల్ ఏర్పాటుచేస్తామన్నారు. ఇప్పటికే లూలూ మాల్‌కు సంబంధించి 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో షాపింగ్ ప్రారంభిస్తామని చెప్పారు.







వరంగల్ జిల్లా: స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్య, జానకిపురం సర్పంచ్ నవ్య ఎపిసోడ్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజయ్యపై నవ్య సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే రాజయ్యతో ప్రాణహాని ఉందని, ఆధారాలు ఇచ్చినా పోలీసులు కేసు నమోదు చేయడంలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరులు తనకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారని, ఇంత జరుగుతున్నా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సొంత పార్టీ మహిళా సర్పంచ్‌కే రక్షణ లేకుంటే ఇక రాష్ట్రంలోని మహిళలకు ఎం న్యాయం చేస్తారని ఆమె నిలదీశారు. ఈ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కడియం శ్రీహరి కూడా కనీసం స్పందించడంలేదని, ఆయనకూ ముగ్గురు కూతుళ్లు ఉన్నారు...నేను ఆయన కూతురు లాంటిదాన్నే కదా..ఈ అంశంపై ఆయన ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. త్వరలో మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తానని సర్పంచ్ నవ్య స్పష్టం చేశారు. కాగా ఎమ్మెల్యే రాజయ్య తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డా రంటూ ఇటీవల సంచలన ఆరోపణలు చేసిన ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ నవ్య మరోసారి ఆయనపై తీవ్ర ఆరోపణలు చేశారు.

# వైఎస్ షర్మిల దారెటు...!?

## వైఎస్సార్ టిపి కొనసాగుతుందా..?? - కాంగ్రెస్‌లో విలీనం అవుతుందా..??

హైదరాబాద్ : వైఎస్ షర్మిల, వైఎస్సార్ టిపి అధ్యక్షురాలు.. తెలంగాణ రాజకీయాల్లో సత్తా చాటేందుకు వ్యూహాలకు పదును పెట్టారు. ఈ తరుణంలో గతకొన్నాళ్లుగా కాంగ్రెస్‌లో చేరతారంటూ విస్తృత ప్రచారం జరుగుతోంది. ఎప్పటికప్పుడు షర్మిల కొట్టిపడేస్తున్నా ఆ వార్తలు మాత్రం ఆగడంలేదు. లేటెస్ట్‌గా షర్మిల అంశంపై మరోసారి తెరపైకి వచ్చింది. షర్మిల కాంగ్రెస్‌లో చేరతారన్న వార్తలకు బలం చేకూర్చేలా కీలక కామెంట్స్ చేశారు టీకాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే. కాంగ్రెస్ అధిష్టానంతో వైఎస్ షర్మిల టచ్‌లో ఉన్నట్టు చెప్పుకొచ్చారు. ఠాక్రే చేసిన ఈ కామెంట్సే ఇప్పుడు తెలంగాణ పాలిటిక్స్‌లో సెన్సేషనల్‌గా మారాయ్. మరోవైపు, బెంగళూరులో కర్నాటక పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌ను కలిసిన ఎంపీ కోమటిరెడ్డి, షర్మిల అంశంపై చర్చించినట్టు ప్రచారం జరుగుతోంది. డీకేతో కోమటిరెడ్డి 40నిమిషాలు సమావేశమైతే ఎక్కువగా షర్మిల చేరికపైనే మాట్లాడుకున్నట్టు తెలుస్తోంది. షర్మిలపై పార్టీ హైకమాండ్ సుముఖంగా ఉన్నట్లు చెప్పారట డీకే. అయితే, షర్మిల జాయినింగ్ విషయంలో టీకాంగ్రెస్ నేతల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారట. ఇక, ఎప్పటిలాగే షర్మిల వైపు నుంచి కామెంట్స్ వచ్చాయ్.. అబ్బే అలాంటిదేమీ లేదంటూ స్టేట్‌మెంట్ రిలీజ్ చేశారు. ఊహాజనిత ప్రచారాన్ని నమ్మొద్దంటూ మీడియాకి చెప్పారు షర్మిల. తనకు తెలంగాణ ప్రజలకు మధ్య అగాధాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. చివరి శ్వాస వరకు తెలంగాణ కోసం పోరాడుతూనే ఉంటానన్నారు షర్మిల. పరిణామాలు చూస్తుంటే, షర్మిల కాంగ్రెస్‌లో చేరడం ఖాయమనేలాగే కనిపిస్తున్నాయ్.

ఇటీవల షర్మిల వేస్తోన్న స్టెప్స్ కూడా అందుకు బలం కలిగిస్తున్నాయ్. కర్నాటకలో కాంగ్రెస్ విజయం సాధించాక డీకే శివకుమార్‌ను కలవడం, రీసెంట్‌గా రాహుల్‌గాంధీకి బర్త్‌డే విషెస్ చెప్పడం, భట్టికి ఫోన్ చేసి పరామర్శించడం, ఇవన్నీ చూస్తుంటే కాంగ్రెస్‌లో చేరడం ఖాయంలాగే అనిపిస్తోంది..! మరి షర్మిల కాంగ్రెస్‌లో జాయిన్ అవుతారా..? వైఎస్సార్ టిపిని మెర్జ్ చేస్తారా? ఈ ప్రశ్నలకు క్లారిటీ రావాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే...!!





# తెల్లారేసరికి తలుపుతట్టిన 'ధనలక్ష్మి'

## కోడికూసినంతనే రైతుబంధు నిధులతో.. మోగిన రైతన్నల మొబైల్స్

హైదరాబాద్: రాష్ట్రంలో పదకొండో విడుత రైతుబంధు పంపిణీ ప్రారంభమైంది. సోమవారం తెల్లారేసరికి రైతుబంధు నిధులతో రైతన్నల మొబైల్స్ మోగిపోయాయి. పొద్దుపొద్దున్నే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే అన్నదాతలకు.. అదే సమయంలో తెలంగాణ సర్కార్ రైతుబంధు నిధులను వారి ఖాతాల్లో జమచేసి సంతోషాన్ని నింపింది.

రైతుబంధు నిధులు తమ ఖాతాల్లో జమ అయినట్లు వచ్చిన మెసేజ్‌లను చూసి రైతులు మురిసిపోయారు. తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు అన్నదాతలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నారు. పంటపొలాల్లో ఆయన చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తున్నారు. రైతుల పాలిట దేవుడు కేసీఆర్ అని ప్రశంసిస్తున్నారు.

రైతు బంధు పంపిణీలో భాగంగా తొలిరోజైన నేడు గుంట భూమి నుంచి ఎకరం విస్తీర్ణం గల భూయజమానులు 22,55,081 మంది రైతుల ఖాతాల్లో రూ.642.52 కోట్ల నగదు జమ అయింది. వానాకాలం సాగుకు సంబంధించిన పంటసాయం ఈనెల 26 నుంచి అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో ఆర్థిక మంత్రి హరీశ్ రావు, ఆర్థికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు దానికి సంబంధిన ప్రక్రియను వేగవంతం చేసి సోమవారం ఉదయాన్నే రైతుల ఖాతాల్లో జమయ్యేట్లు చర్యలు తీసుకున్నారు. ఈ సీజన్‌లో 1.54 కోట్ల ఎకరాలకుగానూ 70 లక్షల మంది రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించనుంది. గతంతో పోల్చితే ఈ సీజన్‌లో 5 లక్షల మంది రైతులకు కొత్తగా రైతుబంధు అందిస్తున్నది. రైతులు, భూ విస్తీర్ణం పెరగడంతో ఈ సీజన్‌లో రైతుబంధు కోసం రూ.7,720.29 కోట్లు ఖర్చు చేయనుంది.

గతంతో పోల్చితే ప్రభుత్వంపై సుమారు రూ.300 కోట్ల అదనపు భారం పడుతున్నది. ఈ సీజన్‌తో కలిపితే రైతుబంధు ద్వారా రూ.72,910 కోట్లు రైతుల ఖాతాల్లో జమయినట్లవుతుంది. కాగా, సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు 1.5 లక్షల మంది పోడు రైతులకు చెందిన 4 లక్షల ఎకరాలకు కూడా రైతుబంధు సాయం అందించనున్నారు.

# సంపాదకీయం

## కమల దళం మొత్తం నరేంద్రుని వెనుకే!

జాతీయ పార్టీ అంటే... ఆ పార్టీకి కొన్ని సిద్ధాంతాలు.. వ్యవహారం.. పరిస్థితి ఉంటాయి. ప్రాంతీయ పార్టీల కంటే.. కూడా జాతీయ పార్టీలకు కొన్ని నిబద్ధతలు నిబంధనలు.. నైతికత ఉంటాయని పేరుకూడా ఉంది. అందుకే కేంద్రంలో ఏర్పాటు చేసే ప్రభుత్వంపై ప్రగాఢ విశ్వాసం కూడా ప్రజలకు ఉంటుంది. కాంగ్రెస్ విషయాన్ని తీసుకుంటే.. కుటుంబ రాజకీయాలు చేసిందని రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులను మార్చిందని.. ఇలా.. అనేక ఆరోపణలు వున్నాయి. ఫలితంగా దేశాన్ని అతి ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ అతి తక్కువ కాలంలో దుంపనాశనం దిశగా అడుగులు వేసింది. ఇక ఇప్పుడు బీజేపీని చూస్తే.. కుటుంబ పార్టీ కాదని.. దీనికి కొన్ని సిద్ధాంతాలు ఉన్నా యని చెప్పుకొనే ఈ పార్టీ ఇప్పుడు ఏక నాయకుడి ఏలుబడిలో సిద్ధాంత దైన్యాన్ని ఎదుర్కొంటోందని.. అంటున్నారు పరిశీలకులు. ఒకప్పుడు.. వాజపేయి.. హయాంలో వ్యక్తి కాదు... పార్టీ ముఖ్యం. పార్టీకి సిద్ధాం తం ముఖ్యమంటూ.. పార్లమెంటు వేదికగానే ఆయన ప్రవచించి.. దానికి కట్టుబడ్డారు. కానీ ఇప్పుడు మోడీ ఏలుబడిలో బీజేపీ అంటే.. మోడీ.. మోడీ అంటే బీజేపీ తప్ప.. మరో మాటే వినిపించ డం లేదు. ఇది ఒకరకంగా కుటుంబ పార్టీల ఆధిపత్యం కన్నా ఎక్కువేనని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పుడు ఎటు చూసినా.. ఎక్కడ విన్నా.. 'నమో నరేంద్ర' మాటే వినిపిస్తోంది. కట్టకట్టుకుని బీజేపీ నాయకులు మొత్తం.. నరేంద్ర మోడీని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఆయనను హైలెట్ చేస్తున్నారు. ఆయన నామస్మరణలో మునిగితేలుతున్నారు. ఇక రాష్ట్రాల్లోనూ.. బీజేపీ పాలిత ప్రభుత్వాలు ఉన్న చోట.. మోడీతో మార్కులు వేయించుకున్న వారే.. ముఖ్యమంత్రులు.. మంత్రులు అవుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ పరిణామం.. ఇప్పటికైతే.. బాగానే ఉన్నా.. మోడీ తర్వాత.. ఎవరు..? అని చూసుకుంటే..పార్టీ కనిపించాల్సిన స్థానంలో వ్యక్తులు కనిపించడం.. పార్టీపై పైచేయి సాధించాలనే ప్రత్యర్థి పార్టీలు పోయి.. మోడీని ఓడిస్తే చాలనే దిశగా అడుగులు వేయడం ద్వారా.. చివరకు సాధించేది.. ఏంటి? అంటే.. బీజేపీని భూస్థాపితం చేసుకోవడమే భావన వ్యక్తం చేస్తున్నారువిశ్లేషకులు. అంతిమంగా ఇలాంటి పోకడలు దేశానికి జాతికి కూడా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేదని చెబుతున్నారు. కుటుంబ పార్టీ లకన్నా.. ఏకవ్యక్తి ఆధిపత్యం మరింత ప్రమాదకరమని అంటున్నారు.

# భగీరథ.. బడికి చేరదా!



పెద్దపల్లి : నిత్యం మనం తాగే నీటిలో ఖనిజ లవణాలు లోపించడం వల్లే 70 శాతం వ్యాధులు సోకుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శుద్ధ జలం తీసుకోవడం ద్వారా ఆరోగ్య రక్షణ సాధ్యమని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మిషన్ భగీరథ నీరు అందించాలని నిర్ణయించారు. పంచాయతీల్లోని పైపులైన్లకు కుళాయి కనెక్షన్ ఇచ్చారు. అయితే శాఖల మధ్య సమన్వయ లోపంతో పాఠశాలలకు నీటి సరఫరా ఆశయం నీరుగారిపోతోంది. దీంతో పిల్లలకు ఎప్పటిలాగే బోరుబావులు, చేతిపంపుల నీరే దిక్కవుతోంది. వర్షాలు కురుస్తుండటంతో పైపులైన్లకు లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోంది. కొందరు విద్యార్థులు భగీరథ నీటిని తాగేందుకు వెనుకాడుతుండగా, మరికొందరు ఇంటి నుంచి నీటి సీసాలను తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు సురక్షితమని క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా లక్ష్యం నెరవేరడం లేదు.

**అసంపూర్తిగా బిగింపు**

గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లో మిషన్ భగీరథ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పైపులకు ఇష్టారాజ్యంగా కనెక్షన్ ఇచ్చి వదిలేశారు. నిర్మించిన కొన్నాళ్లకే పైపుల పగుళ్లతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. బిరడాలు విరిగిపోతున్నాయి. కుళాయిలకు బిరడాలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ఉదయం 8 గంటలు, సాయంత్రం 4 గంటలకు నీటి సరఫరా చేయడంతో ఆ సమయంలో పాఠశాలలు తెరచుకోని ఉండక నీటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. నీటిని నిల్వ చేయడానికి పాఠశాలల్లో ట్యాంకుల నిర్మాణంలో విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ట్యాంకుల కొనుగోళ్లకు నిధుల కొరత అడ్డంకిగా మారింది.

**సమన్వయ లోపం**

లి విద్యార్థులకు రక్షిత జలం అందించే విషయంలో అధికారుల మధ్య సమన్వయం లోపించింది. కుళాయి కనెక్షను ఇచ్చామనే భావన తప్ప విద్యార్థులకు అందుతుందా? లేదా? అనే విషయాన్ని విస్మరించారు. అలాగే పిల్లల్లో రక్షిత జలంపై అపోహలు తొలగించే యత్నాలు ఫలించడం లేదు.

లి జిల్లాలోని 498 పాఠశాలల్లో భగీరథ కనెక్షన్లు ఇచ్చామని చెబుతున్నా ఎక్కడా పూర్తి స్థాయిలో బిగించలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. పాడయిన వనరుల మరమ్మతులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

లి పాఠశాలల్లో నీటి వసతి లేకపోవడంతో కొందరు పిల్లలు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. దూర ప్రాంతాల విద్యార్థులు గత్యంతరం లేక చేతిపంపు, బోరు నీరు తాగడంతో చర్మ, ఇతర వ్యాధులు సోకుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చామని పథకం ఇంట్రా ఈఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీరు సరఫరా అవుతోందని చెప్పారు. సరఫరా సమయంలో పాఠశాలలు తెరచుకోకపోవడంతోనే విద్యార్థులు నీటిని తాగలేకపోతున్నారన్నారు. ట్యాంకులకు సమకూర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించామన్నారు. పాఠశాలల్లో కనెక్షన్ల బిగింపు అసంపూర్తిగా మిగిలాయని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. నీటి వనరులకు మరమ్మతు చేయాలని ఫిర్యాదు చేస్తున్నామని వెల్లడించారు.

# కౌలుకోలేని దెబ్బ



బూర్గంపాడు : ఒకవైపు కుళ్లి.. ఎండిన మొక్కలు. వాటి వెనుక మరోమారు మొలకెత్తి ఎదగని మొలకలు... వాటి మధ్య కొత్తగా గింజలు పెడుతున్న కూలీలు. గోదావరి పరీవాహకంలో ఏ చెలక చూసినా ఇవే దృశ్యాలు. గత నెలలో భారీవర్షాలు, గోదావరి ముంపు రైతుల వెన్ను విరిచాయి. ప్రధానంగా కౌలురైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. మొక్క చనిపోతే మరో విత్తును నాటుతూ పోయారు. కనిష్ఠంగా ఐదెకరాల్లో సాగుచేసిన వారికి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పంట చేతికొచ్చే పరిస్థితులూ లేవని సాగుదారులు గొల్లుమంటున్నారు.

**ఎకరాకు రూ. 15వేల కౌలుతో..**

జిల్లాలో గోదావరి పరీవాహకంలో పత్తి అధికంగా సాగవుతోంది. నదికి మోటార్లు పెట్టుకుని వరినీ పండిస్తుంటారు. పెద్దసంఖ్యలో కౌలు రైతులు కూడా సాగుచేస్తుంటారు. చెలకలకు భూ యజమానులు ఎకరాకు రూ.15వేలు కౌలు తీసుకుంటున్నారు. ఒక్కో రైతు కనీసం అయిదెకరాల వరకు కౌలుకు తీసుకుంటున్నారు. గత నెలలో 10వ తేదీ తరువాత భారీవర్షాలు, గోదావరి ముంపుతో పొలాల్లో నీటిఊట పెరిగింది. విత్తిన పంట, మొలకలన్నీ కుళ్లిపోయాయి. ఇప్పుడు సాగుకు అదును కూడా తప్పిపోయింది. ఈ ఏడాది కౌలు ఎలా చెల్లించాలా అని ఆందోళన చెందుతున్నారు.

**విత్తుతూనే ఉన్నా.. పత్తా లేదే..!**

జూన్‌లో మొదటిసారిగా పత్తి విత్తనాలు నాటారు. మొక్కలు అడుగెత్తుకు వచ్చేసరికి జులైలో భారీవర్షాలు కురిశాయి. చెలకల్లో తేమ పెరిగి మొక్కలు కుళ్లిపోయాయి. వాటి స్థానంలో మరోమారు విత్తారు. అవి కొన్నిచోట్ల మొలకెత్తగా మరి కొన్నిచోట్ల అరడుగు వరకు ఎదిగాయి. ఇంతలో గోదావరి ముంపులో 4రోజులపాటు ఉండిపోవడంతో కుళ్లిపోయాయి. దీంతో గతనెలాఖరులో మరోమారు విత్తారు. ఒండ్రుమేటలు, తేమతో సరిగా ఎదగకపోవడం, మొలకెత్తకపోవడం వంటి సమస్యలొచ్చాయి. ఇపుడు విత్తనం లేనిచోట కొత్తగా నాటుతున్నారు. నాలుగుసార్లు విత్తనాలు వేసినందుకు దాదాపు రూ.లక్ష ఖర్చు వచ్చినట్లు రైతులు చెబుతున్నారు.

**అప్పు పుట్టడం లేదు.. ఆదుకోండయా**

ఈ ఏడాది సాగు కోసం జూన్, జులైలలో బ్యాంకులు, వ్యాపారుల వద్ద రుణాలు తీసుకున్నారు. రెండు, మూడుసార్లు పంటను కోల్పోయినవారు మళ్లీ ప్రయత్నించగా అప్పిచ్చేందుకు ఎవరూ ముందుకురావడం లేదు. నగలను పెట్టి అప్పుతీసుకున్నవారూ ఇపుడేం చేయాలా అని ఆలోచనలో పడిపోయారు. ఈ క్రమంలో పంటల సాగుకు ప్రభుత్వం ప్రత్యేకంగా పరిహారం అందించి వెంటనే తమను ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

**ఇసుక మేటలు.. నష్టాల మూటలు!**

భద్రాద్రి జిల్లాలోని ఏడు మండలాల్లో 17,270 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా. దీనిలో ఎక్కువ భాగం కౌలురైతుల పొలాలే ఉన్నాయి. ఏడువేల ఎకరాల్లో పత్తి, పదివేల ఎకరాల్లో వరి ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. 500 ఎకరాల్లోని పంటచేలల్లో ఒండ్రు, ఇసుక మేటలున్నట్లు ఇప్పటి వరకు నమోదు చేశారు. బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం, పినపాక మండలాల్లో భారీనష్టం వాటిల్లినట్లు అంచనా కడుతున్నారు.

వరి, పత్తి రెండూ పోయాయిఏడెకరాలు కౌలుకు తీసుకున్నా. ఇప్పటి వరకు ఎకరాకు రూ.10వేలు వెచ్చించా. విత్తిన పత్తి విత్తినట్టే పోతోంది. భారీవర్షాలు, వరదలతో నేలలో తేమ పెరిగింది. విత్తులు, మొక్కలు కుళ్లిపోతున్నాయి. పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. పదెకరాలకని పోసిన వరి నారూ ముంపులో పోయింది.

– లక్ష్మీ శివకుమారి, కౌలు రైతు, బూర్గంపాడు

కౌలు రైతులకు పరిహారం ఇవ్వండిబంగారం తాకట్టుపెట్టి రుణం తెచ్చి ఐదెకరాల్లో పత్తి వేశా. ఇప్పటికే నాలుగుసార్లు విత్తనాలు వేశా. ఎకరాకు రూ.15వేలు కౌలిస్తున్నా. గోదావరి ముంపుతో భారీనష్టం జరిగింది. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. పరిహారం అందజేయాలి.– పేరం రమాదేవి, కౌలురైతు, సంజీవ్‌రెడ్డిపాలెం, భద్రాద్రి జిల్లా

# కృత్రిమ దందా!

సంగారెడ్డి : పర్యావరణానికి విఘాతం కలిగించే కృత్రిమ ఇసుక తయారీ జిల్లాలో జోరుగా సాగుతోంది. వాగులు, వంకలు కేంద్రాలుగా ఈ దందా మూడు టిప్పర్లు, ఆరు లారీలన్న చందంగా తరలించి, జేబులు నింపుకొంటున్నారు. కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. మామూళ్ల మత్తులో తూగడం వల్లే తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం... సంగారెడ్డి, కంది, హత్నూర, పటాన్‌చెరు మండలాల్లో అక్రమ వ్యాపారం కొనసాగుతోంది. చట్టరీత్యా నేరమైనా తమను అడిగేవారు లేరని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. కంది మండలం ఎర్దనూర్, బ్యాతోల్, ఆరుట్ల, పటాన్‌చెరు మండలం లక్డారం, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచెర్ల, హన్మన్‌నగర్, హత్నూర మండలం గుండ్ల మాచనూర్, పల్పనూర్, తదితర గ్రామాల్లో పటాన్‌చెరు మీదుగా కంది, సంగారెడ్డి, హత్నూర మండలం మీదుగా నక్కవాగు ప్రవహిస్తోంది. వాగుకు ఆనుకుని కృత్రిమ ఇసుక తయారీకి తెరలేపారు. భారీ వర్షాలతో వరద ఉద్ధృతికి వాగులో ఇసుక మేటలు వేసింది. దీనిని తవ్వడంతోపాటు, వాగుకు రెండు వైపులా వ్యవసాయ భూముల్లో తవ్విఇసుక ఫిల్టర్ల ద్వారా మట్టినుంచి ఇసుకను వేరు చేస్తున్నారు.

**కుప్పలుగా నిలువ చేసి**

హత్నూర మండలం దౌలాపూర్ నుంచి నిత్యం రాత్రి సమయంలో లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారు. మట్టిని శుభ్రం చేసి వచ్చిన ఇసుకను కుప్పలుగా నిల్వ చేసి, అనంతరం లారీల్లో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారు. లారీల్లో సామర్థ్యానికి మించి రవాణా చేయటం వల్ల పల్లె దారులు ధ్వంసం అవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నర్సాపూర్ మండలం మూసాపేట గ్రామంలో భారీ లారీల వల్ల రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని ఇసుక వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులే హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం. నిర్మాణాలు అధికం కావడంతో..ఇసుకకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. దీంతో ఇసుక మేటలపై వ్యాపారుల కన్ను పడింది. ప్రస్తుతం టన్ను ఇసుక రూ.1,300 నుంచి 1,500 వరకు పలుకుతోంది. 12,14,16, చక్రాల లారీలలో 50 నుంచి 80టన్నుల వరకు నింపుతున్నారు. ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. మైనింగ్, భూగర్భ జల, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపణలున్నాయి. హత్నూర మండలం నుంచి నిత్యం పదుల సంఖ్యలో లారీలు తరలుతున్నాయి. దౌల్తాబాద్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టు దాటి వెళ్లాల్సి ఉంటుంది. దీనిని దాటేందుకు ఒక లారీకి రూ. 2వేల నుంచి రూ.5వేల వరకు పోలీసులకు ఇస్తున్నారని సమాచారం. కృత్రిమ ఇసుక వినియోగం ప్రమాదకరమని నిర్మాణాలు చేపట్టేవారు పేర్కొంటున్నారు. ఇసుక తవ్వకాలతో భూగర్భ జల మట్టం తగ్గి పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నిఘా పెంచి చర్యలు తీసుకుంటాంరవీంద్రారెడ్డి , డీఎస్పీ, సంగారెడ్డి

# ఉన్నతి.. ఉపాధికి పెన్నిధి

సంగారెడ్డి :ఉపాధి హామీ కూలీల్లో నైపుణ్యాలు పెంపొందించి జీవనోపాధిని మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్రం 'ఉన్నతి' కార్యక్రమాన్ని తలపెట్టింది. వివిధ రంగాల నిపుణులతో అందిస్తోన్న శిక్షణలు సొంత కాళ్లపై నిలదొక్కుకునేందుకు దోహదం చేయనున్నాయి. కరవును పారదోలి.. ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా గ్రామాల్లో ఉపాధి హామీ అమలవుతోంది. ఇదే తరుణంలో 100 రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని వ్యక్తులకు అర్హత, స్థాయి ఆధారంగా తర్ఫీదు ఇచ్చేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలో కృషి జరుగుతోంది. కొత్తగా మరిన్ని బ్యాచ్‌లకు శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉపాధి హామీ కింద పెద్దసంఖ్యలో కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వాటి సంఖ్య పెద్దమొత్తంలోనే ఉంది. ఈ క్రమంలో ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగ యువత ఉపాధి దిశగా అడుగేసేందుకు ఉన్నతి కార్యక్రమాన్ని చేపట్టారు. మొదట్లో పలు సంస్థల సహకారంతో ఆసక్తి మేర తర్ఫీదు ఇవ్వడం ఆరంభించారు. కరోనా పరిస్థితుల్లో వరుసగా రెండేళ్లు అంతరాయం కలిగింది. ఆ పరిస్థితి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణాన మరింత మందిని ఈ మార్గంలో నడిపించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. నైపుణ్యాలు పెంచేందుకు కృషి జరుగుతోంది.

**అందిపుచ్చుకుంటే ప్రయోజనం..**

శిక్షణా కాలంలో రోజుకు ఒకరికి రూ.237 చొప్పున అందిస్తున్నారు. జిల్లాల వారీగా కేంద్రం అనుబంధ కౌశల్ ప్రగతి పోర్టల్‌లో 18–45 ఏళ్ల వయసున్న వారి జాబితాను పొందుపర్చారు. ఉపాధి దిశగా నడిపించేందుకు ఇస్తున్న శిక్షణపై యువతీ, యువకులు ఆసక్తి చూపటం లేదు. ఉచితంగా అందించే నైపుణ్య అంశాల బోధన.. భవిష్యత్తుకు దోహదం చేయనుంది. ఇదే క్రమంలో అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తే చక్కటి ప్రయోజనం దక్కనుంది.

జిల్లాల్లో ఇలా..సిద్దిపేట జిల్లాలో 2018–19లో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 13 వేలు. అందులో ఉన్నతికి అర్హులు సుమారు 3 వేల (కుటుంబ సభ్యులతో కలిపి) వరకు ఉన్నారు. వీరికి సిద్దిపేటలో యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఈడబ్ల్యూఆర్‌సీ కేంద్రం సహా హైదరాబాద్ న్యాక్ సహకారంతో శిక్షణ అందించారు. ఇప్పటి వరకు 120 మందికి టైలరింగ్, స్పోకెన్ ఇంగ్లిషు, నిర్మాణ రంగం, డ్రైవింగ్, మగ్గం వర్క్‌పై తర్ఫీదు ఇచ్చారు. 30 మంది వివిధ రకాల ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ఆధునిక సాగుపై కృషి విజ్ఞాన కేంద్రాల్లో మెలకువలు నేర్పిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 9965 కుటుంబాలు ఉన్నాయి. అందులో 18 – 45 ఏళ్ల వయసున్న వారు 823 మందిని అర్హులుగా గుర్తించారు. 37 మందికి.. స్పోకెన్ ఇంగ్లిషు, నిర్మాణ, ఇతర రంగాల్లో తర్ఫీదు ఇచ్చారు. పది మంది ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన వారు స్వయం ఉపాధి పొందుతున్నారు.మెదక్ జిల్లాలో 82 మందిని గుర్తించి శిక్షణ ఇచ్చారు. సంగారెడ్డిలోని న్యాక్ కేంద్రం, ఎస్‌బీఐ వారు నిర్వహించే కోర్సులు, మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రం, నర్సాపూర్‌లోని ఈజీఎంఎంలో సదరు ప్రక్రియ పూర్తిచేయించారు. 50 మంది రైతులకు కేవీకేలో సేంద్రియ సాగు, వర్మి కంపోస్ట్‌పై అవగాహన కల్పించారు.

నమ్మకం కలిగింది..ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో టైలరింగ్‌పై 30 రోజుల పాటు శిక్షణ పొందా. అంతకుముందు టైలరింగ్‌పై ఎలాంటి అవగాహన లేదు. ప్రస్తుతం సొంత కాళ్లపై పని చేసుకోవచ్చనే నమ్మకం కలిగింది. త్వరలోనే కుట్టు యంత్రాన్ని కొనుగోలు చేసి అడుగేశాను. 'ఉన్నతి' లాంటి కార్యక్రమాలు స్వయం ఉపాధి కల్పనకు దోహదం చేస్తాయి. ప్రభుత్వం శిక్షణలు ఇవ్వడంతో పాటు అనుగుణంగా రాయితీపై రుణాలు అందించి సొంతంగా దుకాణాల నిర్వహణకు సహకారం అందిస్తే మరింత బాగుంటుంది.– దుద్దెడ స్వరూప, మహమ్మదాపూర్ (హుస్నాబాద్)

# అందరూ ఒప్పంద బోధకులే!

చేగుంట : రాష్ట్రంలోనే ఏకైక గిరిజన బాలికల క్రీడా పాఠశాల.. వివిధ జిల్లాల నుంచి ఎంతో మంది ప్రతిభ ఉన్న నిరుపేద గిరిజన బాలికలు చదువుకుంటున్నారు.. ఇటు చదువు, అటు క్రీడల్లో నైపుణ్యం సాధించేలా శిక్షణ.. ఇలా ప్రతిష్ఠాత్మకంగా క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు నెలకొల్పిన చేగుంటలోని క్రీడా పాఠశాలను పర్యవేక్షణ చేసే ప్రిన్సిపల్ లేకపోవడం పెద్ద లోటు. పేరుకు మాత్రం రాష్ట్రంలోనే ఉన్న ఏకైక పాఠశాల, జూనియర్ కళాశాల కాగా, ఇంతవరకు ప్రిన్సిపల్ పోస్టును మాత్రం భర్తీ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. కనీసం డిప్యుటేషన్‌పై నియమించలేదు.

**పదేళ్ల కిందట..**

చేగుంటలో గిరిజన బాలికల సౌకర్యార్థం గురుకుల పాఠశాలను సుమారు పదేళ్ల కిందట మంజూరు చేశారు. ఐదో తరగతి నుంచి ఇందులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల క్రితం క్రీడా పాఠశాలగా మార్పు చేశారు. గిరిజన బాలికలను చదువుతో పాటు ఆటల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఆయా



కార్యక్రమాలను అమలు చేసేలా, పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయి ప్రిన్సిపల్‌ను నియమించలేదు. ఏడాదికి ఒకరిని డిప్యుటేషన్‌పై నియమిస్తున్నారు. సీనియర్ అధ్యాపకులకు ఈ అవకాశాన్ని ఇస్తున్నారు. రెండు నెలలు గడిచినా..ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తవగా.. ఇంతవరకు ప్రిన్సిపల్‌ను నియమించలేదు. ఆరు నుంచి ఇంటర్ వరకు 480 మంది విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. నర్సాపూర్ పాఠశాల అధ్యాపకురాలు ఇన్‌ఛార్జిగా కొన్ని రోజులు పని చేయగా.. ఇప్పుడు ఆమె రావడం లేదు. వసతులన్నీ ఉన్నా పర్యవేక్షణాధికారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 16 ఉపాధ్యాయులు, అధ్యాపకులు మంజూరవగా.. అందరూ కాంట్రాక్టు వారే కావడం గమనార్హం. పీడీ, పీఈటీ, ఒక కంప్యూటర్ ఆపరేటర్ సైతం పార్ట్‌టైం వాళ్లే మరో ముగ్గురు శిక్షకుల అవసరం ఉంది. విద్యార్థినులకు సక్రమంగా భోజనం అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అల్పాహారం పరిస్థితి ఇలాగే ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం– సంపత్‌కుమార్, ఆర్సీవో, మెదక్ క్రీడా పాఠశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. కసరత్తు జరుగుతోంది. త్వరలోనే పలు పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. అప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

# విలీన కాలనీల్లో నీటి ఎద్దడి

కరీంనగర్ : మండుతున్న ఎండలతో విలీన కాలనీల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఇళ్లల్లో ఉన్న బోరు బావులు, వీధుల్లో ఉన్న చేతి పంపులు ఎండిపోవడంతో ఆయా కాలనీల్లోని ప్రజలు నీటికి అవస్థ పడుతున్నారు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు అక్కడి నివాసితులు ఆందోళనకు గురవుతున్నారు. నగరానికి ఆనుకొని ఉన్న కాలనీలకు శుద్ధజలం సరఫరా కాకపోవడం, పక్కనే ఉన్న వీధుల్లో నీరంతా వృథాగా పోతుండటంతో ఆ ప్రాంతవాసులను కలచి వేస్తోంది. నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తారని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. శాశ్వత పరిష్కారం మాత్రం కావడంలేదు.

నాటి తప్పిదంతోనే సమస్య

విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ కింద తాగునీటి పైపులైను వేశారు. గ్రామపంచాయతీ సమయంలో సరైన స్థాయిలో పైపులైన్లు వేయకపోవడంతో ప్రధాన సమస్యగా మారింది. రెండు ఇంచుల మేర పైపులు వేయడంతో అందుల్లోకి నీరే రావడం లేదు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఉండగా అవి నిరుయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం అవి ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉండి ఎందుకు పనికి రాకుండా మారాయి. రూ.లక్షలు ఖర్చు చేసినా నిరుపయోగంగా మారింది. సరస్వతీనగర్, విద్యారణ్యపురి, సూర్యనగర్, రేకుర్తి శివారు, తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది.

కొత్తగా లైను వేసినా..

విలీన కాలనీల్లో తాగునీరు వేసేందుకు రూ.5.50 కోట్లతో ప్రధాన పైపులైను వేశారు. పలు కాలనీలకు ఇంటర్ కనెక్షన్లు ఇచ్చి సరఫరా చేస్తుండగా కొంతమేర ఫలితం వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో నీరు రావడం లేదంటున్నారు. తీగలగుట్టపల్లిలోని సరస్వతీనగర్‌లో రైల్వే ట్రాక్ వరకు 12 ఇంచుల పైపులైను వేశారు. దానికి ఇంటర్ కనెక్షన్ కూడా ఇవ్వగా, కోర్టు రిజర్వాయర్ నుంచి నీటిని పంపిణీ చేయాల్సి ఉంది. చివరి ప్రాంతం కావడంతో పైపుల్లోకే శుద్ధి నీరు చేరడం లేదు. ప్రధాన రోడ్డు నుంచి సరస్వతీనగర్ వరకు సాధారణ నిధుల కింద రూ.45 లక్షలతో పైపులైను వేసేందుకు అంచనాలు తయారు చేశారు. టెండర్ పిలవాల్సి ఉంది.

సొంతంగా.. ట్యాంకర్లతో సరఫరా..

సరస్వతీనగర్ ప్రాంతంలో సుమారు 600 ఇళ్లకు తాగునీటితోపాటు ఇతర అవసరాలకు ఇబ్బందులు తప్పడం లేదు. బహుళ అంతస్తులు, అద్దెకు ఇచ్చిన కుటుంబాల ఇంటి యజమానులు సొంతంగా ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. మిగతా వారంతా బల్దియా నుంచి వచ్చే ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. రోజులో ఒకటెండ్రు ట్యాంకర్లు వస్తుండగా ఇంటి యజమానులు డ్రమ్ములు, సంపులు నింపుకోవడంతో మిగతా ప్రాంతాలకు సరిపోవడం లేదు. వారంలో నాలుగు రోజులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో సొంత ఖర్చులతో ప్రైవేటు ట్యాంకర్ సమకూర్చి ఇంటింటా పోయిస్తున్నారు. రోజుకు పది ట్యాంకర్లు బావి నుంచి తెప్పిస్తున్నారు.

ఎన్నాళ్లీ కరవు–సరోజన, స్థానికురాలు

గత నెల రోజులుగా బోరు మొత్తం ఎండిపోయింది. నల్లా ఉన్నా నీరు రాదు. చుట్టూ ఉన్న ప్రాంతంలో ఎక్కడా ఉండదు. కార్పొరేటర్ ట్యాంకర్ పంపిస్తే డ్రమ్ములు, సంపులు నింపుతాం. అదీ రాకపోతే ఆ రోజు నానావస్థలు పడాల్సిందే. నల్లా వస్తుందని అదిగో, ఇదిగో అంటున్నారు. ఎన్నాళ్లీ ఈ కరవు.

పరిష్కరించని అధికారులు– తిరుమల, కాలనీవాసి

ఎండాకాలం వస్తే చాలు కాలనీల్లో బోర్లు ఎండిపోతున్నాయి. నల్లా ఇస్తే ఆ నీటితో ఇబ్బందులు తీర్చుకునే వారం. పైపులు వేసి వృథాగా వదిలేశారు. అందుల్లోంచి చుక్కా నీరు రాదు. మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్ సక్రమంగా రావడం లేదు. సమస్యపై పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

# నాకూ రూ.లక్ష కావాలి

సిరిసిల్ల : కులవృత్తులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న బీసీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనున్నట్లు ప్రకటించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి రాయితీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. జిల్లాలో మొత్తం 11,273 మంది బీసీలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొలి విడత పథకాన్ని ప్రకటించింది. ఈ నెల 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయనున్నారు. నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, కుమ్మరి, మేదరి, రజక, పూసలు తదితర కులాల వారికి ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నారు. నిరుపేద, దివ్యాంగులు, వితంతువులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 7 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చారు. అయితే సమయం సరిపోలేదని, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగేందుకే సమయం సరిపోయిందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం 2021 ఏప్రిల్ 1 వరకు ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని తెలిపింది. దీంతో అప్పటికే ధ్రువీకరణ పత్రాలున్న వారికి ఊరట కలిగినా, కొత్తగా ఆదాయ, కులం ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునేవారికి చాలా ఆలస్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్లలో అధిక సంఖ్యలో ఉండే పద్మశాలీలను అర్హుల జాబితాలో చేర్చలేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పలువురు పద్మశాలీలు ఈ పథకానికి అనర్హులని చెప్పారని ఆరోపించారు. కానీ చాలా మంది పద్మశాలీలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించడం గమనార్హం. పైరవీలకు అవకాశంకుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేరుగా అధికారులను కలిస్తే తప్పా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదన్న ఆరోపణలు వ్యక్తమ య్యాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులెవరూ పట్టించుకోలేదని, నిర్లక్ష్య ధోరణి అవలంబించారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పైరవీలతోనే పనులు జరిగాయని, నేతల సిఫారసుకు పెద్దపీట వేశారని ఆరోపిస్తున్నారు. పలువురు అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమవడంతో ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధ్రువపత్రాల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అయినా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతు న్నారు.

ఎంతో ఉపయోగం– రాఘవేందర్, బీసీ సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి అధికారి

ప్రభుత్వం కులవృత్తిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 11,273 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 26లోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కానుంది. ఈ పథకం బీసీలకు ఎంతో ఉపయోగం. ఒకేసారి ఎక్కువ దరఖాస్తులు రావడంతో సర్వర్లు మొరాయించాయి. అధికారులు ధ్రువీకరణ పత్రాలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనడం అవాస్తవం.

# ఉన్నత పాఠశాలలకూ గ్రంథాలయ శోభ!



జనగామ : పాఠశాల విద్య బలోపేతానికి ప్రాథమిక పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు అందించిన ప్రభుత్వం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకూ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులతో పఠనాసక్తి పెంచడానికి, తాను చదివిన పుస్తకం గురించి పది మందికి వివరించేందుకు వేదిక సమకూర్చింది. ఉన్నత పాఠశాలలకు 120 టైటిళ్లు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 74 టైటిళు అందజేసింది. జిల్లా కేంద్రాలకు చేరిన పుస్తకాలను త్వరలో ఎంపిక చేసిన బడులకు పంపుతారు.

ఏ పుస్తకాలంటే..నేషనల్ బుక్‌ట్రస్టు రూపొందించిన పుస్తకాలు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో ఉన్నాయి. సాహిత్యం, కథ, నాటికలు, దేశభక్తుల వీర గాథలు, దేశభక్తి, దైవభక్తికి సంబంధించిన రచనలు ఉన్నాయి. వీటిని నిత్యం చదివితే విజ్ఞానం లభించడంతో పాటు సామాజిక స్పృహ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు 64 పుస్తకాలు, తొమ్మిది, పది తరగతుల వారికి 56 పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 74 రకాల పుస్తకాలు ఉంటాయి. వీటిని ఆకర్షణీయమైన రంగులలో రూపొందించారు.

ఎందుకు విస్తరించారంటే..

ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు విద్యా పరమైన ఒత్తిడి అధికంగా ఉంటుంది. చదువు, పరీక్ష ఫలితాలు, స్థాయి నిర్ధారణ తదితర అంశాలలో విద్యార్థికి మానసిక విశ్రాంతి లేకుండా పోతుంది. కొంత ఊరట కల్గించాలంటే పుస్తక పఠనం ఎంతో ఉత్తమమని నిపుణులు చేసిన సూచన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి రోజూ గ్రంథాలయ సందర్శన, పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయిస్తూ కాలనిర్ణయ పట్టిక తయారు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించింది. వారానికో విద్యార్థి తాను చదివిన పుస్తకం గురించి మిగతా వారికి చెప్పాలి. భయం పోయి.. ధారాళంగా మాట్లాడే నైపుణ్యం కూడా అలవడుతుందని అధికారులు అనుకుంటున్నారు. జయశంకర్, ములుగు, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 495 పాఠశాలలను గుర్తించి గ్రంథాయల పుస్తకాలు సమకూరుస్తున్నారు.

మానసిక ఒత్తిడి తగ్గుతుంది

బొమ్మనబోయిన శ్రీనివాస్ అకడమిక్ మానిటరింగ్ అధికారి, జనగామ జిల్లా

ఉన్నత తరగతుల విద్యార్థికి పాఠ్యపుస్తకాల అధ్యయనంతో ఎంతో ఒత్తిడి ఉంటుంది. టీవీలు సెల్‌ఫోన్‌ల వల్ల అనర్థాలే తప్ప అదనపు ప్రయోజనం ఉండదు. పూర్వకాలంలో పుస్తక పఠనం నిత్యకృత్యం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కొత్త పుస్తకాలు చదవడం, సమీక్షించడంతో భయం పోయి నలుగురిలో మరింత అనర్గళంగా మాట్లాడగలుగుతాలు. మానసిక ఒత్తిడీ తగ్గుతుంది.

# పైపైకి ధరలు.. గుండెల్లో గుబులు!




జనగామ : డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి, దిగుమతి లేకపోవడానికి తోడు అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. వారం రోజుల వ్యవధితోనే ధరలు ఎగబాకడంతో ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. వారం రోజుల కిందట రూ.150కు వచ్చిన సరకులు ఇప్పుడు రూ.250 పట్టుకెళ్లినా రావడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలోని మార్కెట్లలో ఆకాశాన్నంటిన ధరలు చూసి ప్రజలు బేజారెత్తిపోతున్నారు. కొండెక్కిన కొత్తిమీరా కూరగాయలు కొన్నాక కొసరన్నట్లు కొత్తిమీరా అడగటం పరిపాటి. అలాంటిది ఇప్పుడు రూ.5కి కూడా ఇవ్వలేమని వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. రూ.10కి నాలుగైదు కాడల కొత్తిమీరా చేతిలో పెడుతున్నారు. అదేమిటని అడిగితే.. మొన్నటిదాక కిలో రూ.40 పలికిన కొత్తిమీరా ఇప్పుడు కిలో రూ.130 అయిందంటున్నారు. కర్ణాటక నుంచి సరఫరా అవుతుండగా జిల్లాకు చేరుకునే సరికి వేడికి వాడిపోతుంది. రవాణాతో పాటు నష్టం కూడా ప్రజలపైనే వేస్తుండడంతో సామాన్యుడికి 'ధరా'ఘాతమైంది.

దిగుమతి చేసుకోవాల్సిందే

కాకరకాయలు ఒంటిమామిడి, టమాట మదనపల్లి, నిజామాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. క్యాప్సికం, బీన్స్ బెంగళూరు నుంచి వస్తుంది. బోయినపల్లి నుంచి కాలీఫ్లవర్, క్యాబేజీ, బీట్‌రూట్, కీరా దిగుమతవుతోంది. క్యారెట్ హైదరాబాద్ నుంచి, చామగడ్డ సికింద్రాబాద్ నుంచి తీసుకొస్తున్నారు.

కారణం ఇదే

జిల్లాలో కూరగాయల సాగు నామమాత్రంగా ఉంటోంది. రైతులు వేసవిలో బెండకాయ, వంకాయ మాత్రమే పండించారు. భానుడు నిప్పులు చెరగడంతో వీటి దిగుబడి పెద్దగా రాలేదు. ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన వర్షాలతో కొంత నష్టం వాటిల్లింది. దీంతో ఇవి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. టమాట, కాకరకాయ, బీరకాయ, చిక్కుడు, దోసకాయ, కాకరకాయ, దొండకాయ, ఆలుగడ్డలు, క్యాబేజీ, క్యారెట్‌ల దిగుమతులపై ఆధారపడక తప్పడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకుని రావడానికి రవాణా వ్యయం అధికంగా అవుతుంది. సరఫరాలో జాప్యం జరిగితే ఇవి వాడిపోతుండటంతో ఆ నష్టంతోపాటు దళారుల బెడద కూడా వినియోగదారుడిపైనే పడుతోంది. బీన్స్ కిలో ధర రూ.250 ఉండటంతో స్థానిక వ్యాపారులు తెప్పించడం లేదు. స్థానికంగా కూరగాయల లభ్యత పెరిగితే తప్ప ధరలకు కళ్లెం వేయలేమని వ్యాపారులంటున్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి

పచ్చిమిర్చి పరిస్థితి ఇంతే. మొన్నటిదాక కిలో రూ.50 పలికిన పచ్చిమిర్చి ఇప్పుడు రూ.140. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాకు చేరే సరికి రవాణా ఛార్జీలు కలిపి ధర మూడింతలు పెరిగింది.

వేసవిలో సాగు తక్కువే

అనితశ్రీ, డివిజన్ ఉద్యానాధికారి, డోర్నకల్

కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోక తప్పడం లేదు. దీని ప్రభావం ధరలపై కనిపిస్తుంది. జిల్లాలో వేసవిలో కూరగాయల సాగు తక్కువే. రాయితీపై మల్చింగ్ మంజూరు చేస్తున్నాం. సాంకేతిక సూచనలు అందజేస్తున్నాం. బీర, కాకర, చిక్కుడు వంటి పందిరి తోటల సాగుకు ఈజీఎస్ నుంచి సామగ్రి, కూలీలకు పైకం అందిస్తున్నారు. జిల్లాలో నాలుగు పాలీహౌజ్‌లుండగా రెండింటిలో పూల తోటలు, మిగిలిన వాటిలో కీర వేశారు. ఇక 10 షేడ్‌నెట్లలో కీర, చిన్న కీర పండిస్తున్నారు. జిల్లా అవసరాలకు సరిపడే కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది.

# ఆర్టీసీకి రూ.128 కోట్ల ఆదాయం!!

జనగామ : ఆర్టీసీకి వేసవి సెలవులు ఎంతగానో కలిసొచ్చాయి. మే నెలలో ముహూర్తాలు ఉండటంతో శుభకార్యాలు ఎక్కువగా జరిగాయి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఉండటంతో పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు ఇంటిల్లిపాది ప్రయాణాలు చేశారు. ఫలితంగా ఆర్టీసీకి ఆశించిన దానికంటే అధికంగానే ఆదాయం సమకూరింది. ఏప్రిల్, మే, జూన్ (21వతేదీ వరకు) రూ. 128 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ఒక్క మే నెలలోనే రూ.51 కోట్ల ఆదాయం రావడం విశేషం. గతేడాది మేలో రూ. 40.24కోట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి అదనంగా రూ.11.కోట్లు రావడం ఆర్టీసీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

100 రోజుల ఛాలెంజ్..

ఆర్టీసీ యాజమాన్యంతో పాటు రీజియన్ అధికారులు వేసవి సెలవుల నేపథ్యంలో గత మార్చి నుంచే 100 రోజుల ఛాలెంజ్ కార్యక్రమాన్ని చేపట్టి సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. రద్దీ సమయాల్లో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకొని ఓ.ఆర్ శాతాన్ని పెంచారు. విహార యాత్రల కోసం చాలా మంది దూర ప్రయాణాలు చేశారు. రీజియన్‌లోని పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే వారికి రాయితీ అవకాశం కల్పించారు.




బెంగళూరు, హైదరాబాద్, పుణె లాంటి దూర ప్రాంతాలకు ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఫలితంగా ఆదాయం పెరిగింది.

అందరి కృషి ఫలితమే జె.శ్రీలత, ఆర్టీసీరీజనల్ మేనేజర్

రీజియన్‌లోని అన్ని డిపోల సిబ్బంది ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి ఫలితంగానే అనుకున్న లక్ష్యాలను సాధించగలిగాం. ఉన్నతాధికారుల సూచనలను పాటించాం. 100 రోజల కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. కండక్టర్లు, డ్రైవర్లు సంస్థ నిర్ణయించిన లక్ష్యాలను చేరుకున్నారు. వారిలో ఉత్సాహం మరింత పెరిగింది. వేసవి సెలవులను, వివాహాది శుభాకార్యాలను సంస్థ వినియోగించుకుంది. ఆదాయం తీసుకురావడంలో ప్రతిభ కనపరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేస్తున్నాం.

# పశువులకు మేత కరవు

ఎల్లారెడ్డిపేట : జిల్లాలో ఈ ఏడాది పశుగ్రాసం కొరత తీవ్రంగా నెలకొంది. రైతులు వరి కోతల తర్వాత గడ్డిని సేకరించి, నిల్వ చేసి పశువులకు మేతగా అందిస్తుంటారు. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో ఈ యాసంగి సీజన్‌లో వరి కోతల కోసం అత్యధికంగా ట్రాక్ వరికోత యంత్రాలను వినియోగించడం వల్ల వరిగడ్డి చేతికందకుండా పోయింది. పశుగ్రాసం దిగుబడి భారీగా తగ్గిపోయింది. పశువులను కాపాడుకునేందుకు ఎండుగడ్డి సేకరణపై అన్నదాతలు ప్రత్యేక దృష్టి సారించారు. వ్యయప్రయాసలకోర్చి చుట్టుపక్కల గ్రామాల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో యాసంగి సీజన్‌లో మొత్తం 1,72,465 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు చేశారు. అందులో అత్యధికంగా వరి 1,70,451 ఎకరాల్లో వేశారు. మిగతా పంటలైన మొక్కజొన్న 744, గోధుమ 88, నువ్వు 152, పొద్దుతిరుగుడు 304, శనగ 375 ఎకరాల్లో సాగు చేశారు. 287 ఎకరాల్లో ఇతర పంటలను వేశారు. పంట చేతికందగానే అవశేషంగా మిగిలే వరి, మొక్కజొన్నను పశువులకు ప్రధాన మేతగా వినియోగిస్తుంటారు. అయితే వరి కోతల సమయంలో అకాల వర్షాలు కురవడంతో కమతాలు తడిగా మారాయి. సాధారణ వరి కోత యంత్రాలు నడవకపోవడంతో ఫోర్‌వీలర్, ట్రాక్ వరికోత మిషన్ల వినియోగం పెరిగింది. దీంతో పశుగ్రాసం చేతికందకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో టన్ను నుంచి 1.5 టన్నుల వరకు ఎండు వరిగడ్డి లభిస్తుందని అంచనా. వరి గడ్డి దిగుబడి తగ్గిపోవడంతో పశుపోషణ భారంగా మారింది. వరిగడ్డి సేకరణ పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వృథా కాకుండా...ఆవులు, ఎద్దులు, గేదెలకు వరిగడ్డి మేతగా ఉపయోగపడుతుంది. గ్రాసం వృథా కాకుండా ఉండేందుకు యంత్రాల సహాయంతో కట్టలుగా మార్చడం కోసం ఒక్కో వరిగడ్డి కట్టకు రూ. 35 వరకు ఖర్చు పెడుతున్నారు. ఈ వరిగడ్డి వర్షాలకు తడవకుండా వాములుగా పేర్చి ఇళ్ల పరిసరాలు, వ్యవసాయ పొలాల్లో నిల్వ చేసుకుంటున్నారు. అనేక మంది రైతులు పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలోని వరిగడ్డికి రూ. 5 వేల నుంచి రూ.6 వేల వరకు వెచ్చిస్తున్నారు. ముమ్ముందు పశుగ్రాసం కొరత సమస్యను అధిగమించేందుకు ముందు చూపుతో వ్యవహరిస్తున్నారు. ఈ వానాకాలంలో జిల్లాలో ఈ ఏడాది జూన్ వరకు 1.04 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరమవుతుండగా 0.45 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అదనంగా ఉన్నట్లు పశుపోషణశాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. జనవరిలో జిల్లా వ్యాప్తంగా కేవలం 15 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌జి–59 రకం పశుగ్రాసం విత్తనాలను ప్రభుత్వం 75 శాతం రాయితీపై పంపిణీ చేసినట్లు పేర్కొంటున్నారు. కాగా మరో రెండు నెలల వరకు పశువులకు పచ్చిగడ్డి లభించదని, దీంతో ముందు జాగ్రత్తగా వరి గ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. పశువులకు బలవర్ధకమైన మేతను అందించడం కోసం ప్రభుత్వం పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలంటున్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు, ఇతర దాణా సరఫరా చేయాలని కోరుతున్నారు.

కొరత లేదు– డాక్టర్ కొమురయ్య, జిల్లా పశువైద్యాధికారి

పశుగ్రాసం కొరత లేదు. వరి కోతల తర్వాత రైతులు ఎండుగడ్డిని కాల్చివేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతుంది.

పశుపోషణలో జాగ్రత్తలు అవసరం– డాక్టర్ రేణుక, పశువైద్యాధికారి, ఎల్లారెడ్డిపేట

పశుపోషణలో రైతులు మెలకువలు పాటించాలి. లీటరు పాలు ఉత్పత్తి జరగాలంటే పాలిచ్చే ఆవు, గేదెకు రోజూ 2.5 కిలోల దాణా, 40 కిలోల పచ్చిమేత, 5 కిలోల ఎండుమేతను విధిగా అందించాలి. మూడు నెలల వయసు తర్వాత దూడలకు పచ్చిమేత వేయాలి. గర్భం దాల్చిన పశువులకు రెండు కిలోల దాణాతోపాటు 35 కిలోల పచ్చిగడ్డి, 5 కిలోల వరిగడ్డిని ఇవ్వాలి. పాల ఉత్పత్తిలో వెన్నశాతం తగ్గిపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీన్ని అధిగమించేందుకు దాణా పరిమాణంలో 0.5 శాతం ఉప్పు కలిపితే పశువుల్లో సోడియం క్లోరైడ్, ఫాస్పరస్ స్థాయిలు పెరిగి, రుచికరమైన పాలు ఉత్పత్తి అవుతాయి.

# క్రీడా పాఠశాల పిలుస్తోంది !

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో 2023–24 సంవత్సరానికి గాను ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. క్రీడా పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించే వీలుంటుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

మేడ్చల్ జిల్లా హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లో ప్రాంతీయ క్రీడా పాఠశాలలు ఉన్నాయి. 4, 5 తరగతులలో ప్రవేశాలు కల్పిస్తారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా సామర్థ్య పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రతీ పాఠశాలలో 4వ తరగతిలో 40, 5వ తరగతిలో 40 విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 50 శాతం సీట్లు బాలికలకు కేటాయించారు.

వివిధ స్థాయిలో సామర్థ్య పరీక్షలు ..

మండల స్థాయి ఎంపిక పోటీలు జులై 1 నుంచి 5 వరకు ఎంఈవోల పర్యవేక్షణలో జరుగుతాయి. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తే జిల్లా స్థాయి పోటీలకు అర్హులవుతారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు, 3,4 తరగతుల స్టడీ సర్టిఫికెట్లు. రెండు పాస్‌పోర్టు ఫొటోలు వెంట తెచ్చుకోవాలి. జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు జులై 9 నుంచి 15 వరకు జిల్లా క్రీడాశాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతాయి. విద్యార్థులు శారీరక సామర్థ్య పరీక్షల్లో కనీసం 10 పాయింట్లు సాధిస్తేనే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారు.రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు జులై 24 నుంచి 30 వరకు మేడ్చల్ జిల్లా హకీంపేట క్రీడా పాఠశాలలో జోన్ల వారీగా జరుగుతాయి. ఆగస్టు చివరి వారంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఐదో జోన్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, జనగామ జిల్లాలకు సంబంధించి జులై 28న ఎంపిక సామర్థ్య పరీక్షలు ఉంటాయి. ఇందుకు గాను ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారు ఎంపిక సామర్థ్య పోటీలకు ముందు రోజు(జులై 27న) మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

అర్హతలు..4వ తరగతిలో చేరగోరే వారు 1 సెప్టెంబరు 2013 నుంచి 31 ఆగస్టు 2014 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశం పొందేనాటికి 2022–23 సంవత్సరంలో 3వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. 5వ తరగతిలో చేరగోరు వారు 1 సెప్టెంబరు 2012 నుంచి 31 ఆగస్టు 2013 మధ్య జన్మించి ఉండాలి. ప్రవేశం పొందే నాటికి 2022–23 సంవత్సరంలో 4వ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎముకలు విరిగిన వారు, ప్లాట్‌ఫీట్, దొడ్డి కాళ్లు, వెన్నెముక వంగి ఉన్నవారు, బౌలెగ్స్ ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు అనర్హులు.

# బడుల్లో డిజిటల్ పాఠాలు!

జనగామ : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.. మౌలిక వసతుల కల్పనకు 'మన ఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అదేవిధంగా తరగతి గదుల్లో మెరుగైన బోధనకు డిజిటల్ విధానానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందుకోసం మొదటి విడతలో ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటికే చాలావరకు ఎంపికైన పాఠశాలలకు డిజిటల్ బోధనకు అవసరమైన పరికరాలు సరఫరా చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ బోధన ప్రారంభించనున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను కొంత మంది విద్యార్థులు పూర్తిగా అర్థం చేసుకోలేరు. దృశ్య రూపంలో తెరపై చూపిస్తూ, బోధిస్తే సులభంగా అర్థమై గుర్తుంచుకునే అవకాశం ఉంది. ఈ తరహాలో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావించింది. మన ఊరు-మన బడి ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులు చదువుల్లో మెరుగ్గా రాణించేలా ప్రణాళికలు రూపొందించింది. విద్యార్థుల్లో పూర్తి స్థాయిలో విషయ పరిజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ విద్యా సంవత్సరం డిజిటల్ బోధన ప్రారంభిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లోనే 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు డిజిటల్ బోధన చేయడానికి



సన్నద్ధమవుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొదటి విడతలో 51 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. డిజిటల్ బోధనకు అవసరమైన పరికరాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు.

వెనుకబడిన విద్యార్థులకు ఎంతో మేలు

డిజిటల్ విద్యా బోధన అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పలు రకాలుగా మేలు చేకూరనుంది. ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుంటారు. సాధారణంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఒకసారి బోధించే పాఠ్యాంశాలను కొంత మంది సరిగ్గా అర్థం చేసుకునే పరిస్థితి ఉండదు. దీన్ని అధిగమించేలా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించిన అనంతరం విద్యార్థులకు డిజిటల్ తెరపై దృశ్య రూపంలో మళ్లీ అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా ఈ విధానంతో ప్రభుత్వ బడుల్లో చదువుకునేందుకు విద్యార్థులు ముందుకొస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ప్రతి పాఠశాలకు మూడు 'ఐఎఫ్‌పీ'లు

డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు దృశ్య రూపంలో పాఠాలు చెబుతారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ)లను అందించారు. మూడు తరగతులకు ప్రతి పాఠశాలకు మూడు ఐఎఫ్‌పీలు పంపిణీ చేశారు. వీటిని 8, 9, 10 తరగతి గదుల్లో అమర్చారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోయినా అంతరాయం లేకుండా ప్రతి ప్యానెల్ కనీసం రెండు గంటల పాటు పనిచేసేలా యూపీఎస్‌ను అందించారు. అలాగే ఎలక్ట్రిఫికేషన్, నెట్‌వర్క్ కిట్లను సరఫరా చేశారు. 75 అంగుళాలున్న ప్యానెల్‌ను రెండు రకాలుగా వినియోగించుకోవచ్చు. డిజిటల్ తరగతుల బోధనతో పాటు బ్లాక్ బోర్డుగా వినియోగించుకోవచ్చు. డిజిటల్ బోధనకు ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులకు వాటి నిర్వహణపై త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర దారికి మోక్షమెన్నడో..!

జనగామ : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల అనుసంధాన అంతర్రాష్ట్ర మార్గానికి గ్రహణం పట్టింది. రూ.6.50 కోట్ల నిధుల కేటాయించినా అటవీశాఖ అభ్యంతరాలతో లక్ష్యం నీరుగారుతోంది. వెంకటాపురం మండలం విజయపురికాలనీ నుంచి కొత్తపల్లికి తారుదారిగా ఆధునికీకరించాలనే ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పట్టింది. టెండరు నిర్వహించి ఐదేళ్లు గడుస్తున్నా.. అంతర్రాష్ట్ర మార్గానికి మోక్షం లేకుండా పోయింది. ప్రధాన మార్గానికి దగ్గర అవుతామని ఆశించినా.. నిరీక్షణ తప్పని పరిస్థితి.

రూ.6.50 కోట్ల నిధులు నిష్ఫలం..

భద్రాచలం-చంద్రుపట్ల ఆర్‌అండ్‌బీ మార్గానికి అనుబంధంగా విజయపురి కాలనీ-కొత్తపల్లి మధ్య ఉన్న 6.5 కి.మీ మట్టి దారిని ఆధునీకరించాలని రహదారుల భవనాల శాఖ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించగా 2018లోనే మావోయిస్టు ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధుల కింద రూ.6.50 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు టెండరు నిర్వహించారు. భద్రాచలానికి చెందిన ఓ గుత్తేదారుకు పనులను అప్పగించి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ నిధులతో తారు దారితో పాటు 10 ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ మార్గం 2 కి.మీ ప్రభుత్వ భూమిలో ఉ



ండగా, మిగతా 4.5 కి.మీ అభయారణ్యం పరిధిలో విస్తరించాల్సి ఉండటంతో.. అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో కదలిక లేకుండా పోయింది.

సర్వేలు కాగితాలకే పరిమితం..

అభయారణ్యం పరిధిలో నిర్మించనున్న రహదారి విస్తీర్ణాన్ని తగ్గించేలా ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రస్థాయి అధికారుల చొరవతో 9 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న తారుదారిని 7 మీటర్లకే కుదించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వృక్షాల నష్టాన్ని తగ్గించేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఇరుశాఖల అధికారులు ప్రకటించారు. సంయుక్తంగా రెండేళ్ల కిందటనే సర్వే చేపట్టి ప్రభుత్వానికి అధికారులు వేర్వేరుగా నివేదికలు పంపినట్లు సమాచారం. ఇంతవరకు కొలిక్కి రాకపోవడంతో ఈ ప్రక్రియ కాగితాలకే పరిమితమైంది. ఓ వైపు నిధులున్నా.. ప్రగతి దారికి రాని దుస్థితి.

నివేదిక పంపాం : చంద్రమౌళి, ఎఫ్‌ఆర్‌వో

కొత్తపల్లి మార్గానికి సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. రెండేళ్ల కిందటే ఇరు శాఖల సమక్షంలో సర్వే చేపట్టి ప్రతిపాదించాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆమోదం లభించలేదు. ఆర్‌అండ్‌బీ నుంచి నష్టానికి సంబంధించి ఎలాంటి రుసుం చెల్లించినట్లు తమకు సమాచారం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఈ నిర్మాణ ప్రక్రియ కొనసాగనుంది.

# కొసమరుపు..



ఖమ్మం: మధిర పురపాలికలో నిర్మించిన సిమెంటు రహదారి ఇది. సైడ్‌బరమ్ వేయలేదు. అంచుల వెంబడి పలుచోట్ల మొక్కలు మొలవడంతో గుంతలు కన్పించక ప్రమాదకరంగా తయారైంది. మరోవైపు వర్షాలు కురిసినా, భారీ వాహనాల రాపిడికి రోడ్డు చివరలు దెబ్బతిని మిగతా రహదారి ధ్వంసమయ్యే అవకాశముంది.పల్లె, పట్నాల్లో అంతర్గత రోడ్లను రూ.లక్షల వ్యయంతో సిమెంటు రహదారులుగా నిర్మిస్తున్నారు. వెరసి మట్టి, కంకర రహదారులకు మహర్దశ పడుతోంది. వీటితో పరిసర వాసులకు ఎంతో సౌకర్యం కలుగుతోంది. కానీ కనీస నిబంధనలు పాటించకుండానే బిల్లులు జేబులో పడుతున్నాయి. సీసీ రోడ్లు వేసిన నిర్మాణదారు విధిగా ఇరువైపులా మట్టి(సైడ్ బరమ్స్) వేయాలి. ఉభయ జిల్లాల్లో అనేకచోట్ల వీటిని విస్మరిస్తున్నారు. చూడటానికి చిన్న అంశమే అయినా పది కాలాలు మన్నాల్సిన రోడ్డు, రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతోంది.

దారికి ఇబ్బంది.. వాహనదారులకు ప్రమాదకరం

నిర్మాణదారుల నిర్లక్ష్యం అనర్థాలకు కారణమవుతోంది. సైడ్ బరమ్స్ పోయకపోవడం వల్ల రోడ్డు చెడిపోతోంది. సిమెంటు రహదారులు నేలకు ఎత్తులో ఉండటం వల్ల ఇరువైపులా అంచులు మొనదేలి ఉంటున్నాయి. సిమెంటు రోడ్డుకు కింద ఒకటి నుంచి రెండు అడుగుల మేర ఎత్తు తేడా ఉండటంతో వాహనదారులు కాస్త ఆదమరిచినా ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి. ప్రధానంగా ఎదురుగా భారీ వాహనాలు వచ్చిన సమయంలో తప్పుకొనేందుకు సైతం అవకాశం లేకుండా పోతుంది. పలు కాలనీల్లో ఈ పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. నిర్మాణదారులు కేవలం సిమెంటు రహదారులు నిర్మించి చేతులు దులిపేసుకుంటున్నారు. ఇరుపక్కలా సైడ్‌బరమ్స్‌కు గ్రావెల్ తెప్పించి ఏర్పాటు చేయాలి. ఇది భారమని, తమ లాభాలు తగ్గుతాయని వీటి ఏర్పాటుపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వాహనాలు రోడ్డు దిగితే పైకి ఎక్కడం కష్టమవుతుంది. ఈ క్రమంలో భారీ వాహనాల వల్ల అంచులు కూలిపోతున్నాయి. ఇక ద్విచక్రవాహనాలు గతి తప్పితే ప్రమాదం జరిగినట్లే. ఇలా తరచూ ప్రమాదాల వల్ల పలువురు గాయాలపాలవుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. ఇదిలా ఉంటే చివర్లు ధ్వంసమైనపుడు క్రమంగా రోడ్డంతా దెబ్బతిని గుంతలమయం అయ్యే అవకాశం ఉంది. కానీ కొందరు అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా బిల్లులు కానిచ్చేస్తున్నారు.

30 శాతానికి పైగా ఇదే పరిస్థితి..

జిల్లాలోని పురపాలికాల్లో పురపాలక శాఖ నిధులతో, నియోజకవర్గంలోని గ్రామాల్లో నియోజకవర్గ అభివృద్ధి కింద శాసనసభ్యుడి నిధులతో పాటు జిల్లా పరిషత్ నిధుల నుంచి అంతర్గత రహదారులను సిమెంటు రహదారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఉదాహరణకు నియోజకవర్గ కేంద్రమైన మధిరలో రూ.20కోట్లతో సిమెంటు రహదారులు నిర్మించారు. ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పట్టణాలు, పల్లెల్లో సుమారుగా రూ.250కోట్ల మేరకు నిధులు వెచ్చించి సిమెంటు రహదారులను ఏర్పాటు చేశారు. వీటిలో 30 శాతానికి పైగా రహదారుల్లో సైడ్‌బరమ్స్ ఏర్పాటును విస్మరించారు. సిమెంటు రహదారుల నిర్మాణంలో సైడ్‌బరమ్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఇలా కాకుండా సదరు నిర్మాణదారులు రహదారులు మాత్రమే నిర్మించి సైడ్‌బరమ్స్ ఏర్పాటు చేయకుంటే బిల్లులు చేయడం లేదు. గతంలో ఈ పరిస్థితి ఉన్న మాట వాస్తవమే. కానీ ప్రస్తుతం వాటిని పూర్తి చేస్తేనే బిల్లులు చేయిస్తున్నాం.నరేష్‌రెడ్డి, పురపాలక ఏఈ, మధిర

# కేఓసీలో రక్షణ చర్యలు గాలికి..



ఖమ్మం: ఏరియాలోని కోయగూడెం ఉపరితల గనిలో రక్షణ నియమాల అమలులో లోపాలు కనిపిస్తున్నాయి. రక్షణతో కూడిన అధికోత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్న సింగరేణి యాజమాన్యం.. స్థానిక గనిలో ఆ దిశగా సరైన చర్యలు చేపట్టడంలో విఫలమవుతోందన్న ఆరోపణలున్నాయి. తరచూ చోటుచేసుకుంటున్న సంఘటనలే ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఫిట్‌నెస్ లేని వాహనాలు గనిలో తిరుగుతుండటం, రూట్‌మ్యాప్‌లు లేకపోవడం, వేగ నియంత్రిక సూచనలు కానరాకపోవడం, బ్లాస్టింగ్ సమయాల్లో నిబంధనలు సరిగా పాటించకపోవడమే వరుస ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి.

ఈ ప్రమాదాలే... నిర్లక్ష్యానికి సాక్ష్యాలు

కేటీసీలో మట్టి వెలికితీతకు పేలుళ్లు జరపడం తప్పనిసరి. అక్కడకు సమయంలో కనీసం 500 మీటర్ల దూరంలో ఎవరూ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఇటీవల 200 నుంచి 300 మీటర్ల దూరంలో నివాసాలున్నా ఎలాంటి జాగ్రత్తలు చేపట్టకుండా, హెచ్చరికలు చేయకుండా పేలుళ్లు చేపట్టడం ఆందోళన కలిగించింది. ఓబీ నివాస గృహాలపై సుమారు 10 కిలోల బరువు గల రాళ్లు ఎగిరిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండగా త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ నెల 17న కూడా బ్లాస్టింగ్ పాయింట్ నుంచి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న ఓబీ క్యాంపులోని కార్మికుల నివాసాలపై పది కిలోల బరువైన రాళ్లు పడ్డాయి. అతి సమీపంలో రాళ్లు పడటంతో అక్కడ నిద్రిస్తున్న కార్మికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ ఓర్‌మెన్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.ఏప్రిల్‌లో జరిగిన ప్రమాదంలో కిష్టారం గ్రామానికి చెందిన సొసైటీ బెల్ట్ క్లీనింగ్ కార్మికుడి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. రెణ్నెల్ల క్రితం ఓబీలో గ్రేడర్-వోల్వో ఢీకొనడంతో పాల్వంచకు చెందిన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. మూణ్నెల్ల క్రితం వోల్వోలు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ బానోత్ శంకర్ కాలు విరిగింది. ఆయన ఇప్పటికీ కోలుకోలేదు. ఏడాది క్రితం పేలుళ్ల సమయంలో రాళ్లు మీదపడి ఒడిశా కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. “ఉపరితల గనిలో రక్షణ నియమాలను పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షిస్తున్నాం. ఓబీ పేలుళ్లు జరిపే సమయంలో క్వారీ చుట్టూ 12 మంది సెంట్రీలను పంపించి జన సంచారం లేకుండా అప్రమత్తం చేస్తున్నాం. చిన్నపొరపాట్లు జరిగితే వెంటనే సరిదిద్దడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం.”కేఎస్ఎన్ రాజు, సేఫ్టీ అధికారి

# ఇళ్లు నిర్మిస్తామని మోసం




ఇల్లెందు : పేదలకు సొంతింటిపై ఉన్న ఆశే అక్రమార్కుల పెట్టుబడిగా మారింది. ఏజెన్సీలో గృహ నిర్మాణాల పేరుతో పలువురిని బురిడీ కొట్టించగా.. బాధితులు ఒక్కొక్కరు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మాణిక్యారంలో ఒక స్వచ్ఛంద సంస్థ పేరు చెప్పి ముగ్గురు వ్యక్తులు మూడేళ్ల క్రితం ఇళ్ల పథకానికి తెరతీశారు. సొంత స్థలం ఉన్నవారికి రూ.4.5 లక్షలతో రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించి ఇస్తామని కొందరితో ఒప్పందం చేసుకున్నారు. లబ్ధిదారు వాటాగా రూ.లక్షన్నర చెల్లించాలని, ఆ తర్వాత ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల నుంచి మిగతా మొత్తం విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తాము నిర్మించిన ఇళ్లు ఇవేనంటూ కొందరికి స్వయంగా చూపించారు. నిర్మాణాలను పరిశీలించిన వారిలో స్థానిక సర్పంచి కృష్ణ కూడా ఉన్నారు. ఇదంతా నిజమేనని నమ్మిన (సర్పంచి సోదరుడు సహా) 12 మంది గ్రామస్థులు ఒక్కొక్కరు రూ.లక్షన్నర వరకు ముట్టజెప్పారు. తీసుకున్న డబ్బుల్లో రూ.50 వేలతో పునాది, కొంతవరకు పిల్లర్లు నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. తర్వాత నుంచి జాడలేకుండా పోయారు. దీంతో కొందరు సొంత ఖర్చుతో ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. ఇలా ఇల్లెందుతో పాటు గుండాల, మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారం మండలాల్లో ఇళ్ల నిర్మాణాల పేరుతో స్వచ్ఛంద సంస్థ పేరుతో అగ్రిమెంట్ కుదుర్చుకుని పలువురిని మోసం చేసినట్లు బాధితుల వివరాలను బట్టి తెలుస్తోంది. 'పొరుగు జిల్లాల్లో తాము నిర్మిస్తున్న ఇళ్లుగా కొన్ని నిర్మాణాలు చూపారు. దీంతో ఆశపడిన గ్రామస్థులు డబ్బులు చెల్లించారు. కొంత నగదుతో పునాదులు లేపి మోసం చేశారంటూ' సర్పంచి కృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. బాధితులెవరూ తమకు ఫిర్యాదు చేయలేదని స్థానిక సీఐ రవీందర్ పేర్కొన్నారు.

# రైతుబంధు పంపిణీకి సన్నాహాలు

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు పంపిణీకి వ్యవసాయశాఖ సన్నాహాలు చేస్తోంది. ఈనెల 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ సీజన్‌కు సంబంధించి మొత్తం 3,32,893 మంది రైతులకు రూ.364.23 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈసారి పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన 19,969 మంది నూతన పట్టాదారులు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఎకరం నుంచి ఒక్కో ఒకరం వరకు పెరుగుతూ విడతల వారీగా రైతుల ఖాతాల్లో తెలంగాణ ప్రభుత్వం ఈ నిధులను నేరుగా జమ చేస్తోంది.

# కొరవడిన మరమ్మతులు

జగిత్యాల : సాగునీరు, తాగునీరు, చేపల పెంపకం తదితర బహుళ వినియోగ పరంగా జగిత్యాల జిల్లాలో చెరువులు, కుంటలకు అమితమైన ప్రాధాన్యం ఉన్నా నిధుల విడుదల, మరమ్మతుల లేమి వెన్నాడుతోంది. గత వానాకాలంలో జిల్లాలో భారీ వర్షాలతో పెద్దఎత్తున చెరువులు, కుంటలు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపుచ్చారు. మరోవైపు మిషన్ కాకతీయ బకాయి నిధులతో పాటుగా నిర్వహణ నిధులు విడుదల చేయక ఆశించిన ప్రయోజనం కలగటం లేదు...నీటి నిల్వలేమి

జిల్లాలోని 1221 చెరువులు, కుంటల్లో 5.57 టీఎంసీల నీటినిల్వ ఉండగా 875 చెరువులు ఎస్సారెస్పీ పరిధిలో, 345 చెరువులు ఎల్లంపల్లి పరిధిలో ఉన్నాయి. మిషన్ కాకతీయ పథకం ద్వారా సగంమేరకు కూడా వీటిల్లో పునరుద్ధరణ చేపట్టలేదు. గత వానాకాలంలో దాదాపు 200కుపైగా చెరువులు, కుంటలు దెబ్బతినగా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపుచ్చారు. చెరువుల పునరుద్ధరణతో మీటరు మేరకు భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నా పనులన్నీ పూర్తయితేనే ఇది సాధ్యపడుతుంది. పూర్తి విస్తీర్ణం మేరకు పూడికను తీయకపోగా కట్టలపై మట్టిపోయటం, బండరాళ్ల తెట్టెలు కట్టడం, తూములు, మత్తడుల నిర్మాణం తదితర పనులు ఆశించినట్లుగా సాగకపోగా చాలా పనులను అలాగే వదిలేశారు. నీటివనరుల్లోకి వచ్చే కాలువలు శిథిలం కావటం, ఆక్రమణలకు గురికావటం, మరమ్మతులు లేనందున ఆనవాళ్లు లేకుండాపోయి నీటినిల్వ సాధ్యపడటంలేదు.

శాశ్వత చర్యలు అవసరం

జిల్లాలోని చాలాచోట్ల చెరువుల శిఖం భూములు పెద్దఎత్తున ఆక్రమణకు గురయ్యాయి. ఫుల్‌ట్యాంకు లెవెల్ ప్రకారం చెరువుల హద్దులను తేల్చకుండా, ఆక్రమణల స్వాధీనం లేకుండానే పనులు చేపట్టారు. వందశాతం చెరువులకు జియోట్యాగింగ్ చేసినా హద్దులను మాత్రం పూర్తిస్థాయిలో తేల్చలేదు. జియోట్యాగింగ్ చెరువుల వివరాలను అంతర్జాలంలో జీపీఎస్ ద్వారా అక్షాంశ, రేఖాంశాల ద్వారా చెరువును చూపిస్తుంది. కట్ట ఎత్తు, మత్తడి, తూము, ఆయకట్టు తదితర అన్నివివరాలు ఇందులో ఉంటాయి. కానీ పూర్తిస్థాయిలో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోకుండానే జియోట్యాగింగ్ చేసినందున వివాదాలు సమసిపోలేదు. ప్రస్తుతం జిల్లాలోని చాలా చెరువుల్లో కొంతవరకు నీరుండి భూగర్భజలాల పెంపునకు, వానాకాలం పైర్లసాగుకు ఉపకరించనుంది. ప్రాజెక్టుల్లోని నీటిని చెరువుల్లోకి తరలించే తూముల నిర్మాణాన్ని పూర్తి చేయటం, మిషన్ కాకతీయ పనుల పూర్తి, దెబ్బతిన్న చెరువుల మరమ్మతులతోనే చిన్ననీటివనరులు జలకళతోఉండి సాగుకు, చేపల పెంపకానికి ఉపకరిస్తాయి.

అసంపూర్తిగా మిషన్ కాకతీయ

జిల్లాలో 1221 చెరువులు, కుంటలుండగా మిషన్ కాకతీయ పథకం ద్వారా మొదటి విడతల్లో 627 చెరువులు, కుంటల పునరుద్ధరణకు రూ.201 కోట్ల వరకు ఖర్చు చేయగా 66 చెరువుల పునరుద్ధరణ పూర్తికాలేదు. తొలి విడతల్లో చేపట్టిన పునరుద్ధరణను తదుపరి సంవత్సరాల్లోనూ కొంతమేరకు నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా ఇవన్నీ అటకెక్కాయి. నాలుగో విడతలో 133 చెరువుల పునరుద్ధరణకు రూ.31.45 కోట్లతో పనులు చేపట్టినా వీటిల్లో చాలాపనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 5వ విడతలో 130 చెరువులు, కుంటల పునరుద్ధరణకు అధికారులు ప్రతిపాదనలను పంపించగా నిధుల విడుదలలేక పథకం అమలు కావటంలేదు. గుత్తేదారు చేపట్టాల్సిన మూడు నాలుగేళ్ల నిర్వహణ పూర్తిగాకుండానే నిధులివ్వక పథకాన్ని పక్కనబెట్టడంతో గత వానాకాలంలో వర్షాలతో కట్టలు తెగి తూములు, మత్తడివద్ద గండ్లుపడ్డాయి.

# సాగుకు బెంగ లేదు

సిరిసిల్ల : జిల్లాలోని రాజరాజేశ్వర జలాశయం రాష్ట్రానికి తాగు, సాగు నీటికి జల కూడలిగా మారింది. ఎస్సారెస్పీ ఫేజ్-2లో బోయినపల్లి మండలం మాన్వాడలో నిర్మించిన రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయం కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అనుసంధానం చేయడం ద్వారా ఏడాది పొడవునా జలకళ సంతరించుకుంటోంది. మెట్ట ప్రాంతమైన జిల్లాలో వేసవిలో నీటి జాడ కనిపించేది కాదు. అలాంటిది ప్రస్తుతం 20.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.60 టీఎంసీలు. పదో ప్యాకేజీ ద్వారా అన్నపూర్ణ జలాశయాన్ని నింపుతున్నారు. దానిపైన రంగనాయక సాగర్‌లోనూ నీటిని నింపే ప్రక్రియ ప్రారంభమైంది. అక్కడి నుంచి దశల వారీగా మల్లన్నసాగర్, కొండపోచమ్మకు తరలించేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ ఖరీఫ్‌కు వర్షాలు ఆలస్యంగా కురిసినా.. జలాశయాల నుంచి నీటిని విడుదల చేసేందుకు జలవనరులశాఖ ప్రణాళికలు చేస్తోంది. భారీ వర్షాలతో జలాశయంలోకి గతేడాది మానేరు, మూలవాగుల నుంచి 41.57 టీఎంసీల వరద చేరింది. దీనితోపాటు కాళేశ్వరం నుంచి 30.70 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 27.04 టీఎంసీలు వచ్చాయి. మొత్తంగా గతేడాది 99.27 టీఎంసీలు జలాశయంలోకి చేరాయి. వీటిలో అత్యధికంగా 70.56 టీఎంసీలను దిగువ మానేరుకు విడుదల చేశారు. తర్వాత పదో ప్యాకేజీకి 7.51 టీఎంసీలు, కుడి ప్రధాన కాల్వ ద్వారా 2.90 టీఎంసీలు, ఎడమ కాల్వకు 0.032 టీఎంసీలను వానాకాలం, యాసంగి పంటలకు విడుదల చేశారు. వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథకు 1.10 టీఎంసీలు ఉపయోగించారు. 4.48 టీఎంసీలు ఆవిరయ్యాయి. జలాశయంలో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండటంతో అన్ని కాలాల్లో మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తోంది. గతంలో వానాకాలం నుంచి జనవరి, ఫిబ్రవరి వరకే చేపలు పట్టేవారు.ప్యాకేజీల వారీగా..జలాశయాల ద్వారా ఖరీఫ్‌లో సాగునీటి విడుదలకు ప్రణాళికలు చేస్తున్నారు. దానిలో భాగంగా ప్యాకేజీల వారీగా నిర్మాణం పూర్తయిన ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల వారీగా పనుల ప్రగతిని బట్టి ఆయా ప్రాంతాలకు నీటిని విడుదల చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని పదో ప్యాకేజీలోని అన్నపూర్ణ జలాశయం పరిధిలో తాళ్లపల్లి, ఆరేపల్లి, సోమారంపేట, రేపాక గుండారంలోని డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తయ్యాయి. ఈ ప్యాకేజీలో ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల పరిధిలో 30 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, ప్రస్తుతం జరిగిన పనులతో 13 వేల ఎకరాలకే పరిమితం కానుంది.ప్యాకేజీ-11 రంగనాయకసాగర్ జలాశయం ద్వారా ఎల్ఎం-4, ఎల్ఎం-6 ప్రధాన కాల్వలు జిల్లాలోని ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు ఉన్నాయి. దీనిలో ప్రధాన కాల్వల నుంచి డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు 918 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉన్నా ఇప్పటికీ 190 ఎకరాలు మాత్రమే జరిగింది. ఇల్లంతకుంట మండలం దాచారంలో మొన్నటి వరకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదని రైతులు పైపులైను పనులు నిలిపివేశారు. అధికారులు కల్పించుకోవడంతో వారం రోజులుగా పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే నేరుగా చెరువులను నింపే అవకాశం ఉంటుంది.ప్యాకేజీ-12 మల్లన్నసాగర్ ప్రధాన కాల్వ సిద్దిపేట జిల్లా నుంచి ముస్తాబాద్, తంగళ్లపల్లి, గంభీరావుపేట వరకు ఉంది. దీనిలో ప్రస్తుతం ముస్తాబాద్ మండలంలోని ప్రధాన కాల్వల పనులు జరుగుతున్నాయి.

# నల్లటి కురుల్లో.. పచ్చని సుమం

ఆదిలాబాద్ : నల్ల బంగారాన్ని వెలికి తీసే క్రమంలో బొగ్గు గనులు విస్తరించిన ప్రాంతాల్లో కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. దీన్ని అధిగమించేందుకు సింగరేణి యాజమాన్యం ఎన్నో ఏళ్లుగా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కార్మిక క్షేత్రాల్లో పర్యావరణ పరిరక్షణకు ఏటా పెద్దఎత్తున మొక్కలు నాటుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు హరితహారం తీసుకొచ్చాక అందులో సింగరేణి భాగస్వామ్యం అవుతోంది. ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టలేని విధంగా రికార్డు స్థాయిలో మొక్కలు నాటుతూ వాటి రక్షణకు పెద్దపీట వేస్తోంది. భూగర్భ గనుల్లో పైకప్పు కూలకుండా దాట్లు, దిమ్మెలతో సపోర్టు చేస్తారు. దీనికి పెద్దఎత్తున కలప వినియోగించాల్సి ఉంటుంది. అందుకు యాజమాన్యం అన్ని ఏరియాల్లోని ఖాళీ ప్రదేశాల్లో నీలగిరి మొక్కలను నాటి అవి పెరగగానే అవసరాలకు వినియోగించుకునేది. హరితహారం ప్రారంభమయ్యాక సంస్థ తన అవసరాల కోసమే కాకుండా సింగరేణి ప్రాంతాలను హరిత వనాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.

ఐదేళ్లలో ఆరున్నర కోట్ల మొక్కలు



2017 నుంచి 2021 వరకు కంపెనీ సుమారు ఆరున్నర కోట్ల మొక్కలు నాటించింది. అందులో గనులు విస్తరించిన ప్రాంతాల్లో స్వయంగా నాటినవి 4.30 కోట్లు కాగా.. ప్రభావిత గ్రామాలు, సమీపంలోని పట్టణాల్లో 2.20 కోట్లు పంపిణీ చేసింది. ఈ ఏడాది 835 హెక్టార్లలో 50 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించగా.. ఇప్పటికే అన్ని ఏరియాల్లో కార్యక్రమాలను ప్రారంభించారు. కంపెనీ వ్యాప్తంగా 12 నర్సరీల్లో సుమారు 86 లక్షల మొక్కలు సిద్ధం చేశారు. నీలగిరి, వెదురు, వేప, మర్రి, ఎర్రచందనం వంటి అటవీ జాతుల మొక్కలతో పాటు పండ్లు, పూల మొక్కలు వీటిలో పెంచుతున్నారు. ఉద్యోగుల భాగస్వామ్యంతో ఉపరితల గనులు, డంప్‌యార్డులు, భూగర్భ గనులు, కార్మిక కాలనీల్లోని ఖాళీ ప్రదేశాలు, సింగరేణి కార్యాలయాలు, రహదారుల పక్కన మొక్కలు నాటుతున్నారు. నాటిన మొక్కలు పెరిగే వరకు కాంట్రాక్టు పద్ధతిలో గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించి అధికారులు వాటి రక్షణకు చర్యలు తీసుకొంటున్నారు.

గ్రామాలు, పట్టణాలకు పంపిణీ

సింగరేణి నర్సరీల్లో పెంచిన మొక్కలను యాజమాన్యం సమీపంలోని గ్రామాల ప్రజలకు, పట్టణాలు, పురపాలికలకు పంపిణీ చేస్తోంది. కార్మిక కుటుంబాలు, స్థానికులకు అవసరం మేరకు దరఖాస్తు చేసుకొంటే ఉచితంగా మొక్కలు అందజేస్తుంది. సంస్థ అందించిన మొక్కలనే నస్పూర్, మంచిర్యాల, చెన్నూరు, క్యాతన్‌పల్లి పురపాలిక పరిధిలోని జాతీయ రహదారి మధ్యలో సుందరీకరణ కోసం నాటుతున్నారు.

# మూసిన గది.. ఆగని తరగతి

ఆదిలాబాద్ : జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. అనుమతులు.. పునరుద్ధరించుకోకుండానే తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ కఠిన చర్యలకు వెనకాడుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా.. అనుమతి రేపు మాపు వస్తుందంటూ పిల్లల తల్లిదండ్రులను మభ్యపెడుతూ నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండానే ఓ ప్రముఖ కార్పొరేట్ పాఠశాల పేరుతో ఓ అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై పలు విద్యార్థి సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, స్పందన లేకపోవడంతో పాఠశాల ఆవరణలో బైఠాయించి ఆందోళనలు చేపట్టారు. ఎట్టకేలకు స్పందించిన విద్యాధికారులు జులై 27న కాగజ్‌నగర్ మండల విద్యాధికారి భిక్షపతి, రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఆ పాఠశాలను సందర్శించి, మొక్కుబడిగా ఒక గదిని సీజ్ చేశారు. రెండు, మూడు రోజుల తర్వాత మళ్లీ పాఠశాల యజమాన్యం తరగతులను నిర్వహిస్తోంది.

ధనార్జనే ధ్యేయంగా..కాగజ్‌నగర్ పురపాలక పరిధిలో మొత్తం 113 ప్రైవేటు పాఠశాలలున్నాయి. 35 ఉన్నత పాఠశాలలు, 70 యూపీఎస్, 8 ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో 1200 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పని చేస్తుండగా, దాదాపు 22 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు సమాచారం. పలు యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ఇవి ఉంటేనే అనుమతి..అగ్నిమాపకశాఖ, పురపాలక, భవనాలశాఖ, పోలీసు, పర్యావరణ శాఖల నుంచి ఎన్ఓసీ పత్రాల సమర్పించాలి. అద్దె భవన యజమాని ఒప్పందం, కమిటీ ద్వారా నిర్ధారించి ఫీజు వివరాలు, సొసైటీ రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించిన తర్వాతే విద్యాశాఖ అధికారులు అనుమతి ఇస్తారు.

ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలపై జిల్లా అధికారుల పర్యవేక్షణ కరవైంది. అనుమతులు లేకున్నా.. అధికారులు సీజ్ చేసినా.. యజమాన్యం తరగతులు నిర్వహిస్తోందని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏబీవీపీకన్వీనర్ అరుణ్‌కుమార్ ఆరోపించారు. విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందన్నారు.

నిబంధనలు ఇవీ..నూతనంగా ప్రారంభించే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. అయిదేళ్లు పూర్తయిన పాఠశాలలు మళ్లీ పర్మిషన్ పునరుద్ధరించుకున్నాకే తిరిగి పునఃప్రారంభించాలి. కాగజ్‌నగర్‌లో నాలుగు, రెబ్బెన, ఆసిఫాబాద్‌లో రెండు చొప్పున, కౌటాల, గోలేటిలో ఒకటి చొప్పున మొత్తం 08 పాఠశాలలు నేటికి అనుమతులు పునరుద్ధరించుకోలేదు. దీనిపై తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) ప్రతినిధి ఆసిఫ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, స్పందన కరవైనట్లు ఆరోపించారు. సీజ్ చేసినా..జులై 27న పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాల అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో మండల విద్యాధికారి భిక్షపతి, రెవెన్యూ, పోలీసుల సమక్షంలో సీజ్ చేసి, పాఠశాలను నిర్వహించరాదంటూ ఆదేశించారు. ప్రస్తుతం ఆ పాఠశాల పరిపాలన గదికి సీల్ ఉండగానే మిగతా గదుల్లో యథావిధిగా తరగతులను నిర్వహిస్తున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం– భిక్షపతి, మండల విద్యాధికారి, కాగజ్‌నగర్

# ఇద్దరికీ పట్టని దారి.. గుంతలుగా మారి..!



ఆదిలాబాద్ : రాష్ట్ర ఆవిర్భావం కంటే ముందు ఆ రహదారి రాజకీయ నాయకులకు ప్రచారాస్త్రంగా నిలిచింది. కానీ ఇప్పుడది ఎవరికీ పట్టని చందంగా మారింది. ప్రజల కష్టాలను గుర్తించలేని దుస్థితి నెలకొంది. ఇది సాధారణ మార్గం కాదు.. మహారాష్ట్రను అనుసంధానం చేస్తూ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలను కలుపుతూ వెళ్లే కరంజి(టి) రోడ్డు దుస్థితి ఇది. ఆదిలాబాద్ సమీపంలోని జందాపూర్ క్రాస్ రోడ్డు నుంచి భీంపూర్ మండలం గుబిడి వరకు 36 కి.మీ, రహదారి దారుణంగా తయారైంది. నిపాని, సంటర్‌సాంగ్వి, భీంపూర్, కరంజి సమీపంలో నాలుగు హైలెవల్ వంతెనల నిర్మాణం కోసం ఏడాది కిందట రూ.7.47 కోట్లు, నిపాని నుంచి ధనోర వరకు 9.కి.మి. మేర రహదారి కోసం రూ.6 కోట్లు మంజూరైనప్పటికీ పనుల్లో ప్రగతి కనిపించడం లేదు. మరోవైపు 44 జాతీయ రహదారి (జందాపూర్ ఎక్స్ రోడ్డు) నుంచి ఈదుల్లసావర్గాం వరకు ప్రస్తుతం 3.75 మీటర్ల వెడల్పుతో ఉన్న 6.4 కి.మీ. రోడ్డును ఏడు మీటర్లకు పెంచడం కోసం సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్ఐఎఫ్) కింద రూ.20 కోట్లు మంజూరైనప్పటికీ.. టెండర్ ప్రక్రియ దాటడం లేదు. జిల్లా మినరల్ ఫండ్(డీఎంఫ్), సీఆర్ఎఫ్ కింద మొత్తం కలిపి రూ.33.75 కోట్లతో చేపట్టిన పనుల్లో బాలారిష్టాలు దాటకపోవడం ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది.

ఎందుకీ నిర్లక్ష్యం..కరంజి(టీ) రోడ్డు మార్గంలో ఆదిలాబాద్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే జందాపూర్ ఒకే గ్రామం ఉన్నందున, కేవలం 2 కి.మీ. రోడ్డు విస్తరణ పనులను ఆ ఎమ్మెల్యే పెద్దగా దృష్టిసారించడం లేదు. బోథ్ నియోజకవర్గంలోకి వచ్చే భీంపూర్, తాంసి మండలాల పరిధిలో సావర్గాం, పిప్పల్‌కోటి, నిపాని, కప్పర్ల, సంటర్‌సాంగ్వి, ధనోర, వడూర్, అంతర్గావ్, అర్లి(టి)లు కరంజి(టీ)తో కలిపి విస్తరించి ఉంది. ఈ నియోజకవర్గంలోని తలమడుగు, నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, బజార్‌హత్నూర్, బోథ్ మండలాలతో పోల్చుకుంటే భీంపూర్, తాంసి మండలాల్లోని కొన్ని గ్రామాలే పరిమితమై ఉండటంతో బోథ్ ఎమ్మెల్యే దృష్టిసారించడం లేదు. ఫలితంగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ.. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడి పనులు సాగని దుస్థితికి చేరుకుంటోంది. అయితే ఇటీవలి వర్షాల కారణంగా ఈ రోడ్డంతా అధ్వానంగా తయారైంది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం కంటే ముందున్న రహదారి పరిస్థితే ఇప్పుడు కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులు స్పందిస్తే తప్ప రోడ్డు పనులు ప్రారంభయ్యేలా కనిపించడం లేదు.

ప్రమాదభరితంగా

జిల్లాలోనే అత్యంత రద్దీగా ఉండే కరంజి(టీ) రోడ్డు గుంతలు తేలి ప్రమాదభరితంగా ఉందనడానికి ఈ చిత్రమే నిదర్శనం. వాహనాల డ్రైవర్లు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా బోల్తాపడటం ఖాయం. చినుకుపడితే చిత్తడిగా మారుతున్న ఈ మార్గం మొత్తం గుంతలమయమే. ఎదురుగా మరో వాహనం వస్తే తప్పక నిలవాల్సిన దుస్థితి.

తప్పని నిరీక్షణకరంజి(టీ) రోడ్డు గుంతలమయం కావడంతో ఇతర వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులు సరిగా నడవడం లేదు. జందాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు ఎప్పుడు వస్తుందా అని ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిందే. 44వ జాతీయ రహదారి అయినప్పటికీ ప్రయాణికులు కూర్చొని ఉండటానికి కనీసం బస్టాండ్ సైతం లేదు. ఫలితంగా వంతెన కింద నిరీక్షించాల్సి వస్తోంది.

# సరిహద్దే శాపం.. మారుతున్న రూపం

ఆదిలాబాద్ : సునాయసంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో పలువురు జూదాల వైపు ఆకర్శితులై ఆర్థికంగా నష్టపోయి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ జిల్లాల్లో గుట్టుగా సాగుతున్న 'మట్కా' జూదంలో పెట్టుబడి పెట్టి తమ సంపాదనంతా పోగొట్టుకుంటున్నారు. ఈ జూదం ఇన్నాళ్లు కేవలం పట్టణాలకు మాత్రమే పరిమితం కాగా ఇటీవల గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తోంది. పోలీసులు తరచూ దాడులు నిర్వహిస్తూ నిర్వాహకులు, జూదరులను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. నిర్వాహకులు ఇటీవల మరికొంత ముందుకెళ్లి పోలీసులకు పట్టుబడకుండా ఆన్‌లైన్‌లో మట్కాకు తెరలేపారు. ఈ జూదానికి మహారాష్ట్రలో అనుమతి ఉండటం, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాలు మహారాష్ట్రకు ఆనుకొని ఉండటంతో సరిహద్దు ప్రాంతాల్లో ఇది యథేచ్ఛగా సాగుతోంది.

పెద్దల అండ

నిర్వాహకులకు బడా నాయకుల అండదండలున్నాయనే ఆరోపణలున్నాయి. మట్కా కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నా.. నామమాత్రపు కేసులు నమోదవుతున్నాయి. పట్టుబడిన వారు సైతం సునాయసంగా బయటపడుతున్నారు. నిర్వాహకుల్లో చాలా మంది వివిధ పార్టీల నాయకుల అండదండలతో దీన్ని కొనసాగిస్తున్నారు. నిర్వాహకులు అనుమానం రాకుండా ఆటోల్లో, మారుమూల ప్రాంతాల్లో ఎవరికి అనుమానం రాకుండా ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

ఇందులోనూ మరో మోసం

ఈ జూదంలోనూ నిర్వాహకులు జూదరులను మోసం చేస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. జూదం నిబంధనల ప్రకారం.. ఆడే వారు ఏ నెంబరుపై ఎంత డబ్బు పెట్టారో ప్రధాన నిర్వాహకులకు తెలియజేయాల్సి ఉంటుంది. వారి కమీషన్ పోను మిగతా డబ్బును నిర్వాహకులకు జమ చేయాలి. అయితే ఇక్కడ కేంద్రాలు నిర్వహిస్తున్న ఏజెంట్లు జూదరులు పెట్టుబడిగా పెట్టిన డబ్బు లెక్కలు ప్రధాన నిర్వాహకులకు నామమాత్రంగానే చూపిస్తున్నారు. రూ.10 వేలు పెట్టుబడిగా వస్తే కేవలం రెండు, మూడు వేలు మాత్రమే లెక్క చూయించి మిగతాది నొక్కేస్తారు. మట్కా నెంబరు కలిసి వస్తే ఎంతో కొంత చేతిలో పెట్టి పంపించేస్తారు. సదరు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటానికి కూడా ముందుకు రాని పరిస్థితి ఉండటంతో తేలు కుట్టిన దొంగలా మిన్నకుండిపోతున్నారు.

పోలీసుల సహకారం..

కొందరు పోలీసు సిబ్బంది వారితో జతకట్టి 'మామూలు'గా వ్యవహరించడమే ఇందుకు కారణమని విమర్శలున్నాయి. కుమురంభీం జిల్లాలో మట్కాకు అనుకూలంగా వ్యవహరించిన కింది స్థాయి పోలీసులను, ఓ ఉన్నతాధికారిని ఎస్పీ కార్యాలయానికి సైతం అటాచ్ చేశారు. ఈ మధ్య ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల మధ్య మట్కా వసూళ్ల పంపకం విషయంలో వివాదం తలెత్తి ఉన్నతాధికారుల దృష్టికెళ్లింది. ఆ ఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఇలాంటి ఆరోపణల్లో బదిలీ అయిన కానిస్టేబుల్ ఒకరు పైరవీ చేసుకొని మళ్లీ ఇక్కడకే పోస్టింగ్ తెచ్చుకున్నాడు. ఈ వ్యవహారంలో పోలీసులు అప్పుడప్పుడు జూదరులు, నిర్వాహకులను పట్టుకున్న క్రమంలో.. వారి వద్ద ఉండే విలువైన చరవాణులు కాజేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

మహారాష్ట్రలోని నిర్వాహకులు కుమురంభీం జిల్లాలోని కాగజ్‌నగర్,



ఆసిఫాబాద్, రెబ్బెన, ఈజ్‌గాం, వాంకిడి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ఘన్‌పూర్, నిర్మల్ జిల్లాలోని భైంసా, ముథోల్, స్వర్ణ, కుభీరు తదితర ప్రాంతాల్లోని వారితో పరిచయాలు చేసుకొని ఏజెంట్లుగా మారుస్తున్నారు. ప్రత్యేకంగా అడ్డాలు ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కొందరు ఇళ్లల్లోనే కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ల సహాయంతో ఈ దందాను కొనసాగిస్తున్నారు. ఈ పరిజ్ఞానం లేని కొంత మంది ఆయా ప్రాంతాల్లోని శిథిలమైన ఇళ్లను అద్దెకు తీసుకొని చిటీల ద్వారా నిర్వహిస్తున్నారు. పోలీసుల హెచ్చరించినపుడు నిర్వాహకులు ప్రదేశాలు మారుస్తూ నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. నిత్యం రూ.లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయి.

గుర్తించి.. తొలగించి!

ఇది బోథ్ మండలం ఘన్‌పూర్ సమీపంలోని మహారాష్ట్ర సరిహద్దులో మట్కా జూదరులు ఏర్పాటు చేసుకున్న స్థావరం. ఇటీవల పోలీసులు గుర్తించి ఇలా తొలగించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఇలా ఎన్నో స్థావరాలను నిర్వాహకులు ఏర్పాటు చేసుకొని ఈ జూదాన్ని కొనసాగిస్తున్నారు.

మట్కా అంటే..

'మట్కా' అంటే హిందీలో 'కుండ' అని అర్థం. గతంలో కుండలో కొన్ని సంఖ్యలు రాసిన చిటీలు వేసి లాటరీ పద్ధతిలో ఒకటి తీసేవారు. ఆ సంఖ్యను ఊహించి తెలిపిన వారికి డబ్బులు చెల్లించే వారు. కాలక్రమేణా ఇది మట్కా జూదంగా రూపాంతరం చెందింది. ఆదివారం, పండగలు మినహా ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో కల్యాణి మట్కా ప్రారంభ అంకెను ప్రకటించి గంటన్నర వ్యవధి తర్వాత చివరి అంకెను ప్రకటిస్తారు. తాను ఊహించిన నెంబరు తగిలితే రూ.10కి.. రూ.500 నుంచి రూ.600 చెల్లిస్తుంటారు. మహారాష్ట్రలో రూ.10కి వెయ్యి చొప్పున చెల్లిస్తుంటారు. మట్కా చార్టులో అంకెల గారడీని గుర్తించి స్వయంగా ఊహించి ప్రస్తుతం నడుస్తున్న నంబరు ఎంత? తర్వాత వచ్చే సంఖ్య, ఇలా అంచనాలు, లెక్కలతో సాగే జూదమే మట్కా.

ఆన్‌లైన్‌లో ఇలా..

పోలీసులు మట్కా స్థావరాలపై దాడులు చేస్తుండటంతో నిర్వాహకులు ఆన్‌లైన్‌కు శ్రీకారం చుట్టారు. మహారాష్ట్ర, జిల్లాలో ఉన్న నిర్వాహకులతో జూదరులు సంబంధాలు ఏర్పాటు చేసుకొని వారి స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఓపెనింగ్, క్లోజింగ్ నెంబర్లను పంపిస్తారు. ఈ నెంబర్లపై జూదరులు పెట్టదలుచుకున్న డబ్బును ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా నిర్వాహకులకు చెల్లిస్తారు. జూదర్లు ఎంపిక చేసుకున్న నెంబరు మట్కాలో ఎంపికైతే ఆ డబ్బును సైతం నిర్వాహకులు ఈ విధానంలోనే చెల్లిస్తున్నట్లు సమాచారం.

# ధర్మాసుపత్రికి మహర్దశ

కరీంనగర్ : ఉమ్మడి జిల్లా ప్రజలే కాకుండా ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి రోగులు అధిక సంఖ్యలో చికిత్స నిమిత్తం ఇక్కడికి వస్తారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో చికిత్స నిమిత్తం వచ్చే రోగులను వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా బోధనాసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి అక్కడికి తరలించే లోపే ఎన్నో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ వైద్య కళాశాల ఏర్పాటుకు పాలనాపరమైన అనుమతి ఇవ్వడంతో.. జిల్లా ప్రజల ఏళ్ల నాటి నిరీక్షణకు తెరపడింది. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే గుండె, మూత్రపిండాలు, కాలేయం, న్యూరో లాంటి ప్రత్యేక వైద్యసేవలు, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

ఆర్థిక భారం..జిల్లా ఆసుపత్రికి వచ్చిన వారిలో ప్రతి నెలా 40 నుంచి 60 మంది రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం నిమిత్తం వరంగల్, హైదరాబాద్ బోధనాసుపత్రులకు రిఫర్ చేస్తారు. తక్కువలో తక్కువ కరీంనగర్ నుంచి ఒక రోగిని వరంగల్ తీసుకెళ్లాలంటే రూ.3 నుంచి 5వేలు, హైదరాబాద్‌కు రూ.10వేలు వసూలు చేస్తున్నారు. ఆక్సిజన్ సౌకర్యం ఉన్న అంబులెన్స్‌లకైతే వారు అడిగినంత ఇవ్వాల్సిందే. ఇప్పటికే పాలనాపరమైన అనుమతులు రావడంతో పాటు మరో రెండు



నెలల్లో పూర్తి స్థాయి సిబ్బందిని మంజూరు చేయడంతో పాటు గుండె, మూత్రపిండాలు, న్యూరో విభాగాలు సైతం ఏర్పాటవుతామని వైద్యాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దశ మారనుంది..ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలోనే వైద్య కళాశాల ఏర్పాటవనుంది. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో జిల్లా ఆసుపత్రిలో అదనంగా మరిన్ని భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతమున్న 350 పడకల స్థానంలో మరిన్ని పెరగనున్నాయి. ఇప్పటి వరకు వైద్య విధాన పరిషత్తు పరిధిలోని జిల్లా ఆసుపత్రి, కళాశాల మంజూరుతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి వెళుతుంది. జనరల్ ఫిజిషియన్, ఆర్థో, పిల్లల వైద్యులతో పాటు కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ ఇతర విభాగాలు ఏర్పడనున్నాయి.

దశాబ్దాల నిరీక్షణకు తెర

కరీంనగర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లాకు చెందిన ముఖ్యనేతలు దాదాపుగా రెండు దశాబ్దాల నుంచి ప్రయత్నిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో ఇదొక హామీ మిగిలింది. జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో పక్కనే ఉన్న జగిత్యాల, నిజామాబాద్ జిల్లాకు సైతం కళాశాలను మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్‌కు మాత్రం ఇవ్వలేదు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో రెండు ప్రైవేట్ వైద్య కళాశాలు ఉండటంతో కరీంనగర్‌కు ఇవ్వలేదనే ఆరోపణలు కూడా వినిపించాయి. జిల్లా ప్రజల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరగడంతో జిల్లాకు వైద్య కళాశాలకు పరిపాలనా పరమైనా అనుమతులు రావడంతో దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది.

# కనిపించని వానర 'వనాలు'

కరీంనగర్ : జనావాసాల్లోకి వస్తున్న వానరాలతో పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా ఇబ్బందులు తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వానర వనాల పేరిట మొక్కలను పెంచాలని నిర్ణయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా వాటి నిర్వహణ అధ్వానంగా మారింది. నామమాత్రంగా మొక్కలు నాటి వదిలేయగా వాటి పర్యవేక్షణ కరవైంది. రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్నా అతీగతీ లేకుండా పోయింది.

అంతరించిపోతున్న అడవులతో వానర మూకలు గ్రామాల్లోకి చేరి పంట పొలాలను, ఇళ్లపై కప్పులను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల బాధతో చాలా చోట్ల పండ్ల తోటలు, మొక్కజొన్న తదితర పంటల సాగును రైతులు మానేశారు. పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లు, కిరాణ, వ్యాపార కేంద్రాల్లో నిత్యం కిష్కింధకాండ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కోతుల ఆకలిని తీర్చేందుకు 2019 డిసెంబరులో ప్రభుత్వం వానరవనాల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టింది. సమీపంలోని అడవుల్లో పండ్ల తోటలను పెంచాలని నిర్ణయించి ఉపాధిహామీ పథకం నిధులను అనుసంధానించారు. ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు, బీడు భూములు, చిట్టడవులు, ఎస్సారెస్పీ కాలువ గట్లు, గుట్టలతో నిండిన ప్రాంతాలను ఎంపిక చేశారు. వీటి నిర్వహణ బాధ్యత పంచాయతీలకు కట్టబెట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేక అధ్వానంగా తయారయ్యాయి.

లెక్కలున్నా మొక్కల్లేవు

జిల్లాలోని వానర వనాల నిర్వహణ సక్రమంగా లేక మందుబాబులకు, పేకాటరాయుళ్లకు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. వనాల చుట్టూ కంచెల నిర్మాణానికి ఒక్కో పంచాయతీలో రూ.10-20 వేల వరకు వెచ్చించారు. ఓదెల మండలం పిట్టలఎల్లయ్యపల్లి, మడక, పోత్కపల్లి గ్రామాల్లోని వానర వనాలకు కంచె, హద్దులు ఏర్పాటు చేయలేదు. ఇక్కడ పండ్ల చెట్లు కనిపించడం లేదు గానీ, పిచ్చిమొక్కలు బాగా పెరుగుతున్నాయి.

జిల్లాలో ఎంపిక చేసిన 196 పంచాయతీల్లో 376.86 ఎకరాల మేర 1,78,952 మొక్కలను 196 వానర వనాల్లో నాటారు. ప్రతి నెలా(వర్షాకాలంలో నాలుగు నెలలు మినహా) అన్ని పంచాయతీల్లో కలిపి మొత్తం రూ.8.94 లక్షలు నిర్వహణకే ఖర్చు చేస్తున్నారు.

ఉసిరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, రేగు, మామిడి, పాల, మొర్రి, తునికి, ఇప్ప, జీడి, వెలగ, మారేడు, సీమ చింత, జామ పండ్ల మొక్కలు నాటారు. పంచాయతీ, ఉపాధి నిధులను ఖర్చు చేస్తున్నారు. సంరక్షకులను నియమించి పంచాయతీ ట్రాక్టర్లతో నీళ్లు పోయిస్తున్నారు. ఒక్కో మొక్కకు రూ.5 చొప్పున ఉపాధి నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మొక్కలు కనిపించడం లేదు. కాగితాల్లో మాత్రమే అంకెలు కనిపిస్తున్నాయి.




## దిల్లీలో విమానం దిగినవెంటనే మోదీ ఆరా

దిల్లీ: అమెరికా, ఈజిప్టు దేశాల పర్యటన ముగించుకొని ప్రధాని మో అర్ధరాత్రి తర్వాత భారత్ చేరుకున్నారు. దిల్లీలో విమానం దిగిన వెంటనే పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ట్వీట్‌కు సమాధానం ఇచ్చారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ నేతలు హర్షవర్ధన్, గౌతం గంభీర్ తదితరులు విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికారు. వారిని చూసిన వెంటనే దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. 'మమ్మల్ని చూడగానే దేశం గురించి అడిగారు. పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు' అని పార్టీ నేత ఒకరు వెల్లడించారు. భాజపా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనను పురస్కరించుకొని.. మోదీ చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకువెళ్లడానికి ప్రస్తుతం ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తోంది. దీని ఉద్దేశించి మోదీ.. నడ్డాను ప్రశ్నించారు. 'ఆ కార్యక్రమం ఎలా నడుస్తోందని నడ్డాజీని అడిగారు. ప్రభుత్వం అందించిన సుపరిపాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, ఈ ప్రభుత్వంపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నడ్డాజీ వెల్లడించారు' అని భాజపా ఎంపీ మనోజ్ తివారీ మీడియా వెల్లడించారు. నడ్డా తెలంగాణ పర్యటన గురించి, త్వరలో జరగబోయే కేరళ పర్యటన గురించి అడిగారు. చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని నేతలందరికీ సూచించినట్లు సమాచారం.

**బైడెన్ ట్వీట్.. మోదీ రిప్లై :** భారత్, అమెరికా బంధం గతంలో కంటే అత్యంత కీలకంగా, బలంగా, మరింత దగ్గరగా ఉందంటూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ ట్వీట్ చేశారు. దీనికి మోదీ బదులిస్తూ.. బైడెన్ మాటలను అంగీకరించారు. 'నేను మీ మాటలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. మన రెండు దేశాల మధ్య స్నేహం.. ప్రపంచానికి మేలు చేసే ఒక శక్తిగా ఉంది. ఇది ఈ భూమండలాన్ని మరింత సుస్థిరంగా మారుస్తుంది. నా తాజా పర్యటన మన బంధాన్ని మరింత బలోపేతం చేస్తుంది' అని మోదీ ట్వీట్ చేశారు.

ఐదు రోజుల పాటు అమెరికా, ఈజిప్టు దేశాల్లో పర్యటించిన ప్రధాని మోదీ.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, శాస్త్రసాంకేతిక రంగాలకు సంబంధించి రెండు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అలాగే వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు జరిపారు.

## ఎంపీ కుటుంబం కిడ్నాప్ కేసు ఇంకా పూర్తికాలేదు...




అమరావతి: విశాఖపట్నం ఎంపీ కుటుంబం కిడ్నాప్ కేసు ఇంకా పూర్తికాలేదని.. ఇంకా ఉందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. సోమవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఈ కుట్ర బయటకు రావాలంటే సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 13వ తేదీన కిడ్నాప్ అయితే.. 15వ తేదీ వరకు పోలీసులకు తెలియలేదంటే.. ఎంపీ ఈ కిడ్నాప్ విషయం పోలీసులకు చెప్పలేదంటే దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నట్లేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఇంత వరకు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సిట్టింగ్ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ జరిగితే లోక్‌సభ సెక్రటేరియట్ ఎందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేదని వర్ల రామయ్య ప్రశ్నించారు. పట్టపగలు ఎంపీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేస్తే, రాష్ట్ర గవర్నర్ స్పందన రాష్ట్ర ప్రజలకు తెలియకపోవడంలో అర్థం ఏమిటన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన పార్టీ ఎంపీ కుటుంబ సభ్యులు కిడ్నాప్ అయితే ఎందుకు స్పందించలేదు?.. ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. కిడ్నాప్ అయిన వారిలో ఒకరైన ఆడిటర్ జీ.వీ రాష్ట్ర ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడన్నది నిజమేనా?.. కిడ్నాప్ అయిన తర్వాత ఎంపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. "నేను ఈ రాష్ట్రంలో ఉండను నా వ్యాపారమంతా తెలంగాణా రాష్ట్రానికి మార్చుకుంటానని చెప్పడం రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ప్రభుత్వ ముఖాన చెప్పినట్లు కాదా?.. తర్వాత ఎంపీని సీఎంవో అధికారులు బెదిరించి నేను రాష్ట్రంలోనే ఉంటాను తెలంగాణ వెళ్లనని అతని అభీష్టానికి వ్యతిరేకంగా చెప్పించినది నిజం కాదా?" అని వర్ల రామయ్య ప్రశ్నించారు. తన కుటుంబ సభ్యుల కిడ్నాప్ బాధలో ఉన్న ఎంపీ.. ఎవరి బెదిరింపుల వలన ఈ నెల 17న రూ. కోటీ యాభై లక్షలతో 2 పేజీల ప్రతికా ప్రకటనలు"సాక్షి" పత్రికకు ఇచ్చారని వర్ల రామయ్య అన్నారు. ఆ సాక్షి పత్రికకు ఇచ్చిన ప్రకటన నుంచే సీబీఐ దర్యాప్తు చేస్తే ఈ కేసులోని అసలు నిందితులు, పెద్ద తలలు బయటకు వస్తాయన్నారు. విశాఖలో భూ కబ్జా సింహాల మధ్య జరుగుతున్న లావాదేవీలే ఈ కిడ్నాప్‌కు ప్రధానాంశమని అనుకుంటున్న నేపథ్యంలో ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేయాల్సిందేనన్నారు. ఈ కేసులో రాష్ట్ర పోలీసుల దర్యాప్తు సరిగా లేనందున, ముఖ్యమంత్రి వెంటనే ఈ కేసు దర్యాప్తును సీబీఐకు అప్పగించాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.




బ్రహ్మపుర నగరం: ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గంజాం జిల్లాలో పెళ్లి బృందంతో వెళ్తున్న ఓ బస్సు.. ఎదురుగా వస్తున్న మరో బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో 11 మంది దుర్మరణం చెందగా.. మరో 8 మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మపురకు చెందిన ఓ యువతికి నిన్న వివాహం కాగా.. నవ వధువును ఆమె కుటుంబసభ్యులు అత్తింట్లో దింపారు. నిన్న రాత్రి విందు భోజనాల అనంతరం వారంతా ఓ ప్రైవేటు బస్సులో సొంతూరు తిరిగి వెళ్తుండగా.. దిగపొహండి ప్రాంతంలో వీరి బస్సు ప్రమాదానికి గురైంది. అర్ధరాత్రి దాటిన తర్వాత బ్రహ్మపుర–తప్తపాణి రోడ్డులో వీరి బస్సు ఎదురుగా వస్తున్న ఓఎస్‌ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు.. వారి బంధువులు కలిపి మొత్తం 11 మంది మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో వధువు అక్కాచెల్లెళ్లు ఇద్దరు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఘటనలో మరో 8 మంది గాయపడగా వారిని సమీపంలోని ఎంకేసీజీ వైద్యకళాశాల ఆసుపత్రిలో చేర్చారు. వీరిలో ఒకరి ఆరోగ్యం విషమించడంతో అతడిని కటక్ ఎస్సీబీ ఆసుపత్రికి తరలించారు.

**సీఎం నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి :** ప్రమాదంపై ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 3 లక్షల పరిహారం చెల్లించనున్నట్లు సీఎం ప్రకటించారు. మరోవైపు స్పెషల్ రిలీఫ్ కమిషన్ గాయపడిన వారి చికిత్స నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 30వేల చొప్పున ఆర్థికసాయం ప్రకటించింది.

## శ్రీవాణి ట్రస్టులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదు



తిరుమల: శ్రీవాణి ట్రస్టులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడారు. అవగాహన లేకుండానే కొందరు శ్రీవాణి ట్రస్టుపై ఆరోపణలు చేస్తున్నారని తోసిపుచ్చారు. పింక్ డైమండ్, నేలమాలిగలు తరలించారంటూ గతంలో కూడా టీటీడీపై అపోహలు సృష్టించారని తెలిపారు. ఇవ్వన్నీ ఆరోపణలేనని అప్పట్లోనే ఖండించానన్నారు. అయినా భక్తుల్లో ఉన్న అనుమానలను టీటీడీ తీర్చాల్సిందేనని పేర్కొన్నారు. ప్రతీ నెల 1వ తేదీన శ్రీవాణి ట్రస్టుకి ఎన్ని విరాళాలు వస్తున్నాయో టీటీడీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. దూప దీప నైవేద్యలు లేని ఆలయాలకు శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. అలాగే మత్స్యకార్య ప్రాంతాల్లోని 574 ఆలయాలకు శ్రీవాణి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పింక్ డైమండ్‌పై టీటీడీ వేసిన పరువు నష్టం దావా కేసులో కోర్టుకి రెండు కోట్ల రూపాయల భక్తుల డబ్బును చెల్లించారని.. ఆ సొమ్మంతా టీటీడీ పాలకమండలి, అధికారులు వడ్డీతో సహా టీటీడీకి చెల్లించాలని భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## 28న కురుపాంలో సీఎం జగన్ పర్యటన



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో పర్యటించనున్నారు. 28వ తేదీ ఉదయం 8 గంటలకు సీఎం జగన్ తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి.. 10 గంటలకు చినమేరంగి పాలిటెక్నిక్ కాలేజ్ హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.

అక్కడి నుంచి కురుపాంలోని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. జగనన్న అమ్మ ఒడి పథకం నాలుగో ఏడాది నిధులు విడుదల చేసి.. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

## జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,889 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ. 3.10 కోట్లు సమర్పించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 24 గంటలు పడుతోంది. తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయనకు ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. సినీ గాయని సునీత, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

## జర్నలిస్టుల ఉద్యమ నేత అంబటి ఆంజనేయులు కన్నుమూత.. సీఎం జగన్ సంతాపం



విజయవాడ: జర్నలిస్టుల ఉద్యమ నేత అంబటి ఆంజనేయులు (78) విజయవాడలో ఆదివారం రాత్రి కన్నుమూశారు. కాగా, నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో చికిత్స నిమిత్తం ఆయన ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో అంబటి తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు.. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విజయవాడ ప్రెస్‌క్లబ్, అమరావతి ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కూడా సంతాపం తెలిపారు. ఇక, విజయవాడ బావాజీపేటలోని ఆయన నివాసం నుంచి సోమవారం అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అంబటి ఆంజనేయులు ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సలహాదారుడిగా ఆయన సేవలందించారు.

ఉమ్మడి ఏపీలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసి అన్ని జిల్లాల్లో యూనియన్‌ను విస్తరింపజేశారు. ఏపీ న్యూస్ పేపర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా నాన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పలువురు జర్నలిస్టు నాయకులు పేర్కొన్నారు.

## కన్నా నోరు అదుపులో పెట్టుకో.. : మంత్రి అంబటి



పల్నాడు జిల్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కన్నా లక్ష్మీనారాయణ అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. ఇష్టంమొచ్చినట్లు కన్నా మాట్లాడితే వైయస్‌ఆర్‌సీపీ సహించదన్నారు. 'కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్ మాత్రమే. కన్నా పోటీ చేస్తాడో.. పారిపోతాడో తెలియదు. ఎన్నికల ఖర్చుకోసం బీజేపీ ఫండ్ పంపితే మింగిన ఘనత కన్నాది. కన్నా సంగతి అమిత్ షాను అడిగితే బాగా చెబుతారు. మాజీ మంత్రి కన్నా పార్టీలు మారిన వ్యక్తి. చంద్రబాబును తిట్టి వారి బొమ్మలకే పాలాభిషేకం చేస్తున్నాడు కన్నా. కన్నా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి. కన్నా సంగతి గుంటూరు కంటే వారి తోటలో ప్రజలు చెబుతారు.. ఆయన ఇంటిముందు ఫ్లెక్సీలు చెబుతాయి' అని అంబటి మండిపడ్డారు.

## హాయ్ ఏపీ... బైబై బీపీ



నగరి : వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్ వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీపైన, ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా చేస్తున్న వ్యాఖ్యలకు మంత్రి ఆర్కే రోజా ఘాటుగా సమాధానమిచ్చారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఎక్కడకు వెళ్లినా బైబై చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రజలు ఆయనలా పూటకోమాట మార్చేవారు కాదన్నారు. వారు ఇప్పటికే స్థిరమైన నిర్ణయంతో ఉన్నారని హాయ్ ఏపీ.. బైబై బీపీ (బాబూ, పవన్) అనుకుంటున్నారని చెప్పుకొచ్చారు. గుర్తు లేదు, 26 జిల్లాలకు అధ్యక్షులు లేరు. 175 నియోజకవర్గాలకు అభ్యర్థులు లేరు. ఆయనెలా జగన్నను ఓడించేస్తాడో.. ఎలా తరిమేస్తాడో ఎవరికీ అర్థం కావడం లేదని చెపారు. చంద్రబాబు అబద్దాలు ప్రజలు వినీవినీ విసిగిపోయారని ఆయనను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కోవిడ్ లాంటి పరిస్థితిలో పొరుగు రాష్ట్రాలన్నీ ప్రజలను పట్టించుకోకపోతే, మన రాష్ట్రంలో మాత్రమే సరిపడే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచి, సరైన వైద్యం అందించి ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. నాయకుడు ఎలా ఉండాలో తెలియజెప్పడానికి కోవిడ్ సమయంలో జగనన్న తీసుకున్న నిర్ణయాలే సాక్ష్యాలని మంత్రి వివరించారు.

## పంచాయితీ రాజ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన




విజయవాడ: ఏపీలోని పంచాయితీ రాజ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. 9 నెలల నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు లేవంటూ పంచాయతీరాజ్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ప్ల కార్డ్స్ పట్టుకొని పంచాయతీరాజ్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. తొమ్మిది నెలలుగా అప్పులు చేసుకుని తింటున్నామన్నారు.

ఇప్పుడు అప్పు కూడా పుట్టని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 9 నెలలుగా సీఎస్, సజ్జల రామకృష్ణారెడ్డి, పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ సూర్య కుమారి, పంచాయతీరాజ్ మంత్రి ముత్యాల నాయుడు, పెద్దిరెడ్డిని కలిసి తమ సమస్యలు వివరించామని, ఎవరిని జీతాలు గురించి అడిగినా ఎవరూ తమకు న్యాయం చేయలేదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోయారు. సామరస్యంగా నిరసన తెలుపుతుంటే 9 నెలల జీతాలు ఇచ్చి ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఇదే బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామన్నారు. కాగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు పది సంవత్సరాల నుంచి 15 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

## శ్రీనివాసులరెడ్డి హత్య.. ఎంతటివారైనా వదిలిపెట్టం: ఎస్పీ అన్బురాజన్

కడప: కడప జిల్లాలో సంచలనం రేపిన శ్రీనివాసులరెడ్డి హత్యకేసులో ప్రధాన నిందితుడు ప్రతాప్‌రెడ్డి సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. నిందితుల్లో శ్రీనివాసులు, సురేశ్‌కుమార్, హరిబాబు, సుబ్బయ్య, రాణి ఉన్నట్లు చెప్పారు. శ్రీనివాసుల రెడ్డి హత్యకు భూ వివాదాలే కారణమని ఎస్పీ పేర్కొన్నారు. " గతంలో శ్రీనివాసులరెడ్డి, ప్రతాప్‌రెడ్డి మధ్య ల్యాండ్ సెటిల్‌మెంట్ విభేదాలున్నాయి. శ్రీనివాసులరెడ్డి.. ప్రతాప్‌కు రూ. 80 లక్షలు, శ్రీనివాసులకు రూ. 60 లక్షలు ఇవ్వాలి. డబ్బు ఇవ్వకపోవడంతో నిందితులు కక్ష పెంచుకున్నారు. వారికి సహకరించిన రాణి అనే మహిళనూ అరెస్టు చేశాం. మరికొందరు అనుమానితులకు నోటీసులు ఇచ్చాం." అని అన్బురాజన్ పేర్కొన్నారు. కేసులో ఎంతటివారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ అన్నారు. హత్య కేసులో ఎలాంటి రాజకీయ కోణం లేదని, భూ వివాదాలు, సెటిల్మెంట్ వ్యవహారాలే కారణమని చెప్పారు. గూగుల్ టేకౌట్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నామని, త్వరలో మరికొందరిని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. హత్య సమయంలో కిందపడిన కత్తిని మహిళ ధైర్యంగా పక్కన పడేసిన విషయాన్ని గుర్తు చేసిన ఎస్పీ... ఆమె ధైర్యాన్ని మెచ్చుకోవాల్సిందేనని, పోలీసుశాఖ తరఫున మహిళను సన్మానిస్తామని చెప్పారు. గత శుక్రవారం ఉదయం జిమ్ నుంచి వస్తున్న శ్రీనివాసుల రెడ్డిని ఇద్దరు వ్యక్తులు బురఖాలు ధరించి కత్తులతో నరికేసిన సంగతి తెలిసిందే.

# పిజ్జా తింటే సరే కానీ.. మరీ ఇంతగా హొయలు పోవాలా?

పిజ్జాలు బర్గర్లు తినడం నేటితరం ట్రెండ్. రాగి జావ-సగ్గు బియ్యం- సేమియాల రోజులు పోయాయి. కే.ఎఫ్.సి- డోమినోస్ అంతర్జాతీయ బ్రాండ్ ఆహారాల్ని రోస్టెడ్ ప్యాకింగ్ ఫుడ్స్ ని మాత్రమే అబగా ఆరగించడం యువతరానికి అలవాటైపోయింది. ఏదైతేనేం.. ఇక్కడ రాశీఖన్నా అందుకు మినహాయింపేమీ కాదు. కెరీర్ తొలి నాళ్ల నుంచి బొద్దుగా ఉన్న ఈ అమ్మడు ఎప్పుడూ తిండి కట్టేయలేదు. అవసరం మేర డైట్ పాటించి తన పాత్రకు తగ్గట్టు రూపాన్ని మలుచుకునేందుకు రాశీ ఎప్పుడూ తపించింది. అలాగని తిండిని తగ్గించలేదు. ఫ్లూటుగా తిని దిట్టంగా తయారవ్వడం అనే అలవాటు తనకు ఉన్నా దానికి తగ్గట్టు కసరత్తులతో ప్రతిదీ బ్యాలెన్స్ చేస్తోంది.



ఇటీవలి కాలంలో అందం ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం రాశీఖన్నా చాలా శ్రమిస్తోంది. రాజ్ అండ్ డీకే 'ఫర్జీ' లాంటి సిరీస్ తో రాశీ కి బిగ్ బ్రేకిచ్చారు. రాశీ పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. ఆ తర్వాతా వరుసగా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇలాంటి సమయంలో తన కెరీర్ కి ఎలాంటి డిస్ట్రబెన్స్ ని కోరుకోవడం లేదు. అందుకు తగ్గట్టే జిమ్ముల్లో నిరంతరం కసరత్తులు చేస్తూ శరీరాకృతిని అదుపులో ఉంచుతోంది. అయితే అన్నివేళలా తిండి కట్టేయాల్సిన పని లేదు. ఇదిగో ఇలా అందంగా అబగా పిజ్జాలు బర్గర్లు కూడా తినొచ్చని రాశీ చెప్పకనే చెబుతోంది. ఒక రకంగా యూత్ ని టెంప్ట్ చేస్తూ నోరూరించేస్తోంది. అయితే ఈ ఫోటోగ్రాఫ్ ని బాగా పరిశీలిస్తే... రాశి సొగసైన బాత్ రోబ్ ధరించి రుచికరమైన పిజ్జా తింటూ కనిపిస్తోంది. చిరు తిళ్లు కూడా గ్లామర్ కలయిక తో సొగసుగా ఉండాలని రాశీ కోరుకుంటోందా? ఎంతో మోడ్రన్ గా కనిపిస్తున్న ఈ బ్యూటీ యూత్ ని టెంప్ట్ చేసే పన్నాగం పన్నిందని అర్థమవుతోంది. అయినా పిజ్జా తింటే సరే కానీ.. మరీ ఇంతగా హొయలు పోవాలా? అంటూ కొందరు అభిమానులు రాశీని ప్రశ్నిస్తున్నారు.

# రూ.13 కోట్లతో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన స్టార్ కిడ్

టాలీవుడ్ స్టార్స్ లో చాలా మందికి వ్యవసాయ భూములు.. కమర్షియల్ కాంప్లెక్స్ లు మరియు ఫామ్ హౌస్ లు ఉంటాయి. బాలీవుడ్ సెలబ్రెటీలు మాత్రం ఎక్కువ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతారు. అలాగే రియల్ ఎస్టేట్స్ లో పెట్టుబడులు పెడుతారు. అంతే తప్ప వ్యవసాయ భూముల పై పెట్టుబడి పెట్టడం తక్కువ. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కి ఫామ్ హౌస్ ఉంటుంది. అందులోనే ఆయన ఎక్కువ సమయం గడుపుతూ ఉంటాడు అంటారు. అక్కడ వ్యవసాయం చేస్తూ ఉన్న ఫోటోలు మరియు వీడియోలు కూడా సోషల్ మీడియా లో అప్పుడప్పుడు చూశాం. ఇప్పుడు షారుఖ్ ఖాన్ కూతురు కూడా వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది. మహారాష్ట్ర



రాయ్ గడ్ జిల్లా లోని తీర ప్రాంత పట్టణం అయిన అలీబాగ్ ప్రాంతం లో దాదాపుగా 13 కోట్ల రూపాయలు పెట్టి షారుఖ్ ఖాన్ కూతురు సుహాన ఖాన్ వ్యవసాయ భూమి ని కొనుగోలు చేసిందని బాలీవుడ్ మీడియా సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది. సుహాన ఖాన్ కు వ్యవసాయం అంటే ఆసక్తి ఉండటం వల్లే షారుఖ్ స్వయంగా ఆమె పేరు మీద ఈ వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు అంటూ వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు షారుఖ్ కాంపౌండ్ నుండి ఈ విషయమై ఎలాంటి అప్డేట్ లేదు. కానీ సుహాన ఖాన్ వ్యవసాయ భూమి కొనుగోలు చేసింది నిజం అంటూ బాలీవుడ్ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు.




# గాయకుడితో ప్రేమలో శ్రీదేవి చిన్న కూతురు?



శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ కెరీర్ పరంగా ఫుల్ స్వింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ సరసన భారీ చిత్రంతో టాలీవుడ్ లో అడుగుపెడుతోంది. అయితే కెరీర్ పరంగా ఇంత బిజీగా ఉన్నా కానీ మరోవైపు జాన్వీ కపూర్ ఎఫైర్స్ గురించి నిరంతరం ఏవో కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ జాన్వీ పూర్తిగా కెరీర్ పైనే దృష్టి సారించింది. ఫస్ట్ క్రష్.. ప్రేమాయణాలు ఎన్ని ఉన్నా కెరీర్ కంటే అవేవీ ముఖ్యం కాదని జాన్వీ కపూర్ ఎంతో పరిణతితో ముందుకు సాగుతోంది. అయితే ఇప్పుడు శ్రీదేవి రెండో కుమార్తె ఖుషీ కపూర్ ప్రేమాయణంపైనా ఆసక్తికర గాసిప్ వైరల్ అవుతోంది. నిజానికి ఖుషీ సినీఎంట్రీకి వేళాయింది. జోయా అఖ్తర్ ది ఆర్చీస్ వెబ్ సిరీస్ తో ఖుషీ నటిగా ఆరంగేట్రం చేస్తోంది. షారూఖ్ కుమార్తె సుహానా ఖాన్ - అమితాబ్ మనవడు అగస్త్య నందా సహా ఇతర నటీనటులు నటించిన ది ఆర్చీస్ తో బాలీవుడ్ అరంగేట్రం కోసం సిద్ధంగా ఉన్న ఖుషీ కపూర్ పై ఇంతలోనే ఎఫైర్ కథనాలు వేడెక్కిస్తున్నాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ కెనడియన్ సింగర్ %ాూ% ధిల్లాన్ తో ప్రేమలో ఉందని ప్రచారం ఊపందుకుంది. ఎపి ధిల్లాన్ 'ట్రూ స్టోరీస్....' పాట సాహిత్యంలో ఖుషీ పేరు వినిపించినప్పటి నుండి ఆ ఇరువురి నడుమా రిలేషన్ షిప్ పుకార్లు పుట్టుకొచ్చాయి. ఈ తాజా లింక్ -అప్ పుకారుతో అభిమానులు చాలా థ్రిల్ కి గురయ్యారు. అయితే నెటిజనులు ఖుషీపై అసహ్యకరమైన వ్యాఖ్యలు చేయడం విచారకరం. ఆర్చీస్ ఫస్ట్ లుక్ బయటకు వచ్చినప్పటి నుండి ఖుషీ గురించి బోలెడన్ని వ్యాఖ్యలు వినిపించాయి. AP ధిల్లాన్ తన పాట సాహిత్యంలో ఖుషీ పేరును ఎలా ఉపయోగించాడు? అంటే.. నవ్వితే మీరు ఖుషీ కపూర్ లాగా కనిపిస్తారని ఈ పాటలో అతడు ఒక పదం ఉపయోగించాడు. "జాదోన్ హస్సే తన్ లగే తు ఖుషీ కపూర్".. నువ్వు నవ్వినప్పుడు ఖుషీ కపూర్ లాగా కనిపిస్తావు ! అనే పదాన్ని ధిల్లాన్ ఉపయోగించాడు. నిజానికి ఈ పోలికను అతడు పాటలో చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. దీంతో ఖుషీ AP ధిల్లాన్ తో డేటింగ్ చేస్తోందంటూ ప్రచారం దావానలంలా వ్యాపించింది. ఇప్పటివరకూ దీనిపై ఖుషీ స్పందించలేదు. తన నుంచి స్పందన ఎలా ఉంటుందో చూడాలంటూ అభిమానులు చాలా హుషారుగా ఉన్నా కానీ అట్నుంచి స్పందన లేదు. ఈ జంట లవ్ పుకారుపై స్పందిస్తూ ఒక నెటిజన్ ఇలా వ్యాఖ్యానించారు. హద్ హెచ్ ఏసా భీ క్యా హాస్ దేతీ హెచ్ వో ...వైసే వో ఖుషీ కపూర్ భీ బిల్కుల్ అచే న్హీ లగ్తీ హస్తే హ్యూ ....చూసా హువా ఆమ్ లగ్తీ హ్ ....ఉస్మే.భీ దాంట్ బహార్ నిక్లే హ్యూ...అని వ్యాఖ్యానించాడు. నేపో కిడ్స్ కి ప్రమోషన్ చేయడం కోసం BCZ వారి చిత్రం వస్తోంది" అని మరొకరు వ్యాఖ్యానించారు. ఖుషీ కపూర్ కపూర్ అంటే ఇంట్లో ఎంతో గారాభం. తండ్రి బోనీ కపూర్ .. సోదరి జాన్వీ కపూర్ తనని ఒక పెట్ కంటే ఎక్కువగా రక్షించుకుంటారు. ఖుషీ నటిగా మారినందుకు జాన్వి ప్రతిసారీ మాటల్లో ఉబ్బితబ్బిబ్బవుతోంది. బోనీ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఖుషీ నటనపై ఆసక్తిని వ్యక్తం చేసిన తీరు తనను ఆశ్చర్యపరిచిందని జాన్వీ మొదటి చిత్రం 'ధడక్' ప్రచార వేదికపై చూసిన రోజునే ఖుషీ కూడా నటించేందుకు అంగీకరించిందని బోనీ వెల్లడించారు. ది ఆర్చీస్ OTTలో విడుదల కానుంది. బాలీవుడ్ లో ఖుషీ కపూర్ సహా ముగ్గురు స్టార్ కిడ్స్ ఈ సిరీస్ తో పరిచయం అవుతున్నారు.

# 2024 సమ్మర్..ఆ నలుగురిది సమరమే!




2023 సమ్మర్ కాస్త చప్పగానే సాగింది. రెండు..మూడు సినిమాలు మినహా బాక్సాఫీస్ ని షేక్ చేసిన స్ట్రెయిట్ సినిమాలేతే లేవు. బరిలో స్టార్ హీరోలు కూడా లేకపోవడంతో! సమ్మర్ అంత కిక్ ఇవ్వలేదన చెప్పాలి. మాలీవుడ్ కంటెంట్ టాలీవుడ్ ని ఏలిందనొచ్చు. ఇక తదుపరి లైనప్ జులై నుంచి దసరా వరకూ కొన్ని సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అటుపై క్రిస్మస్..సంక్రాంతి టార్గెట్ గా మరికొన్ని చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇక 2024 సమ్మర్ మాత్రం రసవత్తరంగానే కనిపిస్తుంది. అగ్ర హీరోలంతా క్యూలో కనిపిస్తున్నారు.ఓ సారి వాటి లైనప్ చూస్తే.. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య 'దేవర' తెరెక్కుతోన్న సంగతి తెలిసిందే. నవంబర్ లోగా షూటింగ్ పూర్తిచేసి ప్రకటించిన ఏప్రిల్ 5వతేదీకే రిలీజ్ చేయాలని ముందుకు కదులుతున్నారు. పక్కా ఆ తేదికి ప్రేక్షకుల ముందుకొచ్చేస్తుంది. ఇక పాన్ ఇండియా చిత్రం పుష్ప-2 కూడా సమ్మర్ బరిలోనే దిగే అవకాశం ఉంది. సంక్రాంతి రిలీజ్ అనుకుంటున్నారు గానీ వీలుపడదు. అప్పుడు ప్రత్యేకంగా కొన్ని సినిమాలు రిలీజ్ అవుతాయి. వీటితో పాటు అనువాద సినిమాలు ఎక్కువగానే ఉంటాయి. 'పుష్ప-2' పాన్ ఇండియా రిలీజ్ కాబట్టి పోటీలేని సమయాన్ని చూసుకుని రిలీజ్ చేయాలి. ఆ లెక్కలో సినిమా సమ్మర్ లోనే వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ -శంకర్ కాంబినేషన్ లో రూపొందుతున్న'గేమ్ ఛేంజర్' కూడా సమ్మర్ కే ఫిక్సై అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ క్లైమాక్స్ కి చేరింది. ఈ చిత్రం రిలీజ్ కూడా వేసవి అయితే అనుకూలంగా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. ఇక సూపర్ స్టార్ మహేష్ 28వ చిత్రం కూడా సమ్మర్నే టార్గెట్ చేసినట్లు వినిపిస్తుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా షూటింగ్ ఇదే ఏడాది పూర్తిచేయాలన్నది ముందు ప్లాన్. కానీ ఇప్పుడా ప్లాన్ మారినట్లు సమాచారం. షూటింగ్ పూర్తిచేయడానికే మరో ఆరునెలలు సమయం పడుతుందిట. ఆ లెక్కన పోస్ట్ ప్రొడక్షన్ పూర్తవ్వడానికి రెండు నెలలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఈసినిమా కూడా వేసవిలోనే రిలీజ్ అవుతుందని ఊహాగానాలు వస్తున్నాయి.

# చీరందంలో కాజల్ బ్యూటీ కెవ్వుకేక!

చందమామ కాజల్ అగర్వాల్ సెకెండ్ ఇన్నింగ్స్ లోనూ దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. పనైపోయిం దన్న ప్రతీ సారి తారా జువ్వులా పైకి లేస్తుంది. తల్లైంది కెరీర్ ముగిసిందని విమర్శలొచ్చినా ఆవేవి అమ్మడి వేగాన్ని ఆపలేకపోయాయి. కాజల్ లైనప్ చూస్తే! నవ నాయికల బిజీని మంచి కనిపిస్తుంది. స్టార్ హీరోల చిత్రాలతో పాటు లేడీ ఓరియేంటెడ్ సినిమాలు చేస్తుంది. తమిళ్..తెలుగు చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతుంది. ఎలాంటి ఛాన్స్ వచ్చినా విడిచిపెట్టడం లేదు. మే హూనా అంటూ సైన్ చేసి ముందుకె ళ్లిపోతుంది. అమ్మడి వయసు 40 కి చేరువలో



ఉన్నా! బ్యూటీ విషయంలో ఇంకా కుర్రాళ్లకి నిద్ర పట్టకుండా చేస్తుంది. తాజాగా కాజల్ చీరందంలో ఒదిగిపోయిన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. ఇదిగో ఇక్కడిలా క్రీమ్ కలర్ సారీలో షోల్డర్ లెస్ బ్లౌజ్ లో తనలో బ్యూటీని ఆవిష్కరించింది. చేతికి గాజులు..చెవికి బుట్టలు ధరించి నేచరల్ బ్యూటీని హైలైట్ చేస్తుంది. పెదాలపై అందమైన నవ్వు ముఖంలో గ్లో.. మైమరిపించే ఆ కళ్లు ఒక్కసారిగా 25 ఏళ్ల కాజల్ ఓల్డ్ బ్యూటీలోకి తీసుకెళ్లినట్లు అయింది. చీరలో కొంగొత్తగా కనిపిస్తుంది. సారీలో అమ్మడి మెరుపులు తొలిసారి కానప్పటికీ ఈసారి మాత్రం సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుంది. ప్రస్తుతం ఈఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. కాజల్ అభిమానులు అమ్మడి అందానికి ఫిదా అవుతున్నారు. తమదైన శైలిలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ప్రసవం తర్వాత కాజల్ ఆ మధ్య కాస్త బొద్దు రూపంలోకి మారిందని విమర్శలొచ్చినా వాటిని వేగంగా తొలగించు కోగలిగింది. హబ్బీ గౌతమ్ కిచ్లూ కూడా కాజల్ కి అన్నిరకాలుగా అండదండలుగా నిలుస్తున్నాడు. వృత్తి పరంగా ఎలాంటి నిబంధలను పెట్టకుం డా పూర్తి స్వేచ్ఛతో పనిచేసుకునే వెసులు బాటు కల్పించడంతోనే అమ్మడు ఇవన్నీ చేయగల్గుతుంది. సినిమాల సంగతి చూస్తే తెలుగులో బాలయ్య సరసన భగంవత్ కేసరిలో నటిస్తోంది. అలాగే సత్యభామ అనే లేడీ ఓరియేంటెడ్ సినిమా చేస్తుంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో ఉమెన్ సెంట్రిక్ చిత్రాలతో సత్తా చాటాలన్నది అమ్మడి ప్లాన్. ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు చేసింది గానీ ..ఆరకంగా ఇంకా సక్సెస్ ట్రాక్ లోకి రాలేదు.

# సమంత పై శోభిత అలా.. చైతూని కూడా ఇలా అంది!

శోభితా ధూళిపాళ పరిచయం అవసరం లేదు. ఈ తెలుగమ్మాయి హిందీ పరిశ్రమలో హవా సాగిస్తోంది. అడపాదడపా తెలుగు సినిమాల్లో నటిస్తూనే అటు ఉత్తరాదిన భారీ ఫాలోయింగ్ సంపాదించుకుంది. అయితే ఇటీవల అక్కినేని నాగచైతన్యతో ఎఫైర్ సాగిస్తోందంటూ వరుస కథనాలు రావడం సంచలనమైంది. చైతన్య -శోభిత ఇరువురు తమ సంబంధాన్ని ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదు. ఈ జంట వ్యక్తిగత జీవితాలపై రకరకాల ఊహాగానాలు సాగుతూనే ఉన్నాయి. అయినా వేటికీ శోభిత కానీ చై కానీ స్పందించలేదు. తాజా ఇంటర్వ్యూలో నాగచైతన్య గురించి సమంత గురించి శోభితకు ప్రశ్న ఎదురైంది. శోభిత స్పందిస్తూ ఎంతో హుందాగా ఆ ఇరువురి గురించి మాట్లాడటం ఆసక్తిని కలిగించింది. చిత్ర పరిశ్రమలో సమంత ప్రయాణం ఎంతో గొప్పగా సాగుతోందని శోభిత మెచ్చుకున్నారు. సమంత ఆకట్టుకునే లైనప్ తో కెరీర్ ని



సాగిస్తోందని తాను ఏ ప్రాజెక్ట్ చేసినా హెడ్ లైన్స్ లోకి రాగలిగే విధానం నిజంగా బాగుందని శోభిత ప్రశంసించింది. సామ్ ప్రయాణం అద్భుతంగా ఉందని కొనియాడింది. నాగ చైతన్య గురించి మాట్లాడుతూ-"అతడి స్వభావం మంచిద"ని శోభిత కాంప్లిమెంట్ ఇచ్చింది. అతడు ఎంతో శాంత స్వభావి. ప్రశాంతమైన వ్యక్తి.. చాలా డిగ్నిఫైడ్ గా కనిపిస్తాడు. నేను నిజంగా అభినందిస్తున్నాను.. అని వ్యాఖ్యానించింది. ప్రస్తుతం శోభిత వ్యాఖ్యలు గూగుల్ లో ట్రెండింగ్ లో ఉన్నాయి. అయితే మీడియా అంతా ఎంతో హుందాగా కథనాలు రాయడంపై శోభిత క్రిప్టిక్ పోస్ట్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. శోభిత కెరీర్ మ్యాటర్ కి వస్తే గూఢచారి తర్వాత అడివి శేష్ తో కలిసి మేజర్ చిత్రంలో నటించింది. నటిగా అత్యుత్తమ ప్రదర్శనతో మైమరిపించింది. శోభిత లయన్స్ గోల్డ్ అవార్డ్ ను దక్కించుకుంది. బాలీవుడ్ లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన 'ది నైట్ మేనేజర్'లో ఆదిత్య రాయ్ కపూర్ - అనిల్ కపూర్ లతో కలిసి శోభిత కీలక పాత్రలో నటించింది. రీమేక్ లో ఎలిజబెత్ డెబిక్కీ పాత్రను పోషించగా తన పాత్రకు మంచి పేరొచ్చింది. శోభిత ధూళిపాల తదుపరి వరుసగా వెబ్ సిరీస్ లు సినిమాలతో బిజీగా ఉందని తెలుస్తోంది.




# భారీ కాన్వాయ్‌తో మహారాష్ట్రకు..

హైదరాబాద్: భారాస అధినేత, తెలంగాణ సీఎం కే సీఆర్ మహారాష్ట్ర పర్యటనకు బయల్దేరి వెళ్లారు. రెండు రోజుల పాటు ఆ రాష్ట్రంలో సీఎం పర్యటన కొనసాగనుంది. సోలాపుర్, దారాశివ్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. ప్రగతిభవన్ వద్ద నుంచి రెండు బస్సులు, సుమారు 600 కార్లతో భారీ కాన్వాయ్ మహారాష్ట్రకు బయల్దేరింది. కేసీఆర్, మరికొందరు ముఖ్యనేతలు బస్సులో ప్రయాణిస్తున్నారు. మహారాష్ట్ర పర్యటనకు వెళ్లినవారిలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, భారాస ముఖ్యనేతలు ఉన్నారు.

# ‘ఉప్పల్ స్కైవాక్’ను ప్రారంభించిన కేటీఆర్.. ప్రత్యేకతలివీ..



హైదరాబాద్: నగరంలోని ఉప్పల్ కూడలిలో నిర్మించిన స్కైవాక్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కాలినడకన రోడ్డు దాటేవారి కోసం హెచ్ఎండీఏ దీన్ని నిర్మించింది.

660 మీటర్ల మేర ఏర్పాటు చేసిన ఈ స్కైవాక్‌కు మొత్తంగా రూ. 25 కోట్లు కేటాయించారు. నాలుగు వైపుల నుంచి నేరుగా ఉప్పల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, రామంతాపూర్ రహదారులతో పాటు మెట్రో స్టేషన్‌కు ఈ వంతెనను అనుసంధానించారు.

మెట్లు ఎక్కలేని వారికోసం ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. స్కైవాక్ పైన, కింద, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. ఇక గ్రీనరీ, పాదచారుల కోసం టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చారు. నడిచివెళ్లేవారికి రక్షణ కోసం ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ అమర్చిన ఎల్ఈడీ దీపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పైన కూడా ఎండ తగల కుండా ఉండేందుకు విదేశాల నుంచి తెప్పించ్చిన రూఫ్‌లను ఏర్పాటు చేశారు.

**స్కైవాక్ ప్రత్యేకతలివీ..** నిర్మాణ వ్యయం: రూ. 25 కోట్లు. నిధులు: రాష్ట్ర ప్రభుత్వం నుంచి. పొడవు: 660 మీటర్లు. వెడల్పు: 3, 4, 6 మీటర్ల చొప్పున. ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌లోకి అనుసంధానం. మెట్రో స్టేషన్ నుంచి నిత్యం ప్రయాణించే వారు: 25–30 వేల మంది. రింగురోడ్డులో రాకపోకలు సాగించే పాదచారుల సంఖ్య: సుమారు 20 వేలు. పాదచారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నడక సాగించే వీలు.

# రాహుల్ గాంధీతో తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశం




దిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ నేతలతో ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సమావేశమయ్యారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌కు చెందిన దాదాపు 35 మంది నేతలు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిపోయిన పలువురు నేతలు తిరిగి సొంతగూటికి చేరుతుండటం ఆనందంగా ఉందని రాహుల్ అన్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ‘ఘర్ వాపసీ’ కార్యక్రమం జరుగుతోందని ఆయన వ్యాఖ్యానించారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, అందుకు పార్టీ నేతలంతా సమష్టిగా పోరాడాలని రాహుల్ దిశా నిర్దేశం చేసినట్లు నేతలు పేర్కొన్నారు. ‘కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో’ నినాదంలో ముందుకెళ్లాలని రాహుల్ కోరారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కేసీ వేణుగోపాల్, జానారెడ్డి, షబ్బీర్ అలీ, మధుయాష్కీతోపాటు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, గురునాథరెడ్డి తదితరులు ఉన్నారు. మరోవైపు ఇటీవల భారాస నుంచి బయటికొచ్చిన జూపల్లి, పొంగులేటితోపాటు మరికొందరు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. జులై 2న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, పార్టీ కండువాలు కప్పుకోవాలని తామంతా భావిస్తున్నామని, ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా రావాల్సిందిగా రాహుల్, మల్లికార్జున ఖర్గేలను వారు ఆహ్వానించారు.

# ధరణిపై ఎవరు చెప్పింది నిజం?: మల్లు రవి




న్యూఢిల్లీ: నాగర్ కర్నూల్‌లో నిన్న జరిగిన సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట్లాడుతూ.. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని అన్నారని, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధరణిలో మార్పులు చేస్తామని అన్నారని.. ఈ ఇద్దరిలో ఎవరు చెప్పింది నిజం...ఇద్దరి మధ్య ఏమైనా గొడవ ఉందా...? అని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ప్రశ్నించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నిధులు దండుకున్నారని గతంలో ప్రదాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా ఆరోపణలు చేశారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని గతంలో బండి సంజయ్ కూడా అన్నారని.. ఇప్పుడు ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ పిట్టల దొరల మాటలు మాట్లాడుతున్నారని, కవిత అరెస్ట్ అని అన్నారు, ఫోన్లు ధ్వంసం చేశారని అన్నారు.. ఏమైందని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ ఈ రెండు పార్టీలు ఒకటేనని మల్లు రవి తీవ్రస్థాయిలో విమర్శించారు.

# గొడ్డళ్లు కత్తులతో దాడి.. ముగ్గురి హత్య




రెబ్బన: కుమురంభీం జిల్లా రెబ్బన మండలం జక్కుపల్లిలో దారుణం చోటు చేసుకుంది. భూతగాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రత్యర్థులు గొడ్డళ్లు, కత్తులతో దాడికి దిగడంతో.. మహిళ సహా ముగ్గురు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మొత్తం 15 మంది దాడికి పాల్పడినట్లు సమాచారం.




# మళ్లీ నడపనన్న పైలట్

జైపూర్: దిగ్గజ విమానయాన సంస్థ ఎయిరిండియా మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ సంస్థకు చెందిన విమానం ఒకటి అత్యవసరంగా జైపూర్‌లో దిగింది. అయితే దాన్ని మళ్లీ టేకాఫ్ చేసేందుకు పైలట్ ససేమిరా అనడంతో కొన్ని గంటల పాటు నిలిచిపోయింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే.. లండన్ నుంచి బయల్దేరిన ఎయిరిండియా ఏఐ–112 విమానం షెడ్యూల్ ప్రకారం ఆదివారం తెల్లవారుజామున దాదాపు 4 గంటల సమయంలో దిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ అవ్వాల్సి ఉంది. అయితే, దిల్లీ ఎయిర్‌పోర్టు వద్ద వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో 10 నిమిషాల పాటు అక్కడే గాల్లో చక్కర్లు కొట్టిన విమానాన్ని ఆ తర్వాత రాజస్థాన్‌లోని జైపుర్‌కు దారిమళ్లించారు. దీంతో విమానం జైపుర్ విమానాశ్రయంలో అత్యవసరంగా దిగింది. అయితే, దాదాపు రెండు గంటల తర్వాత విమానం తిరిగి దిల్లీ వెళ్లేందుకు దిల్లీ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ క్లియరెన్స్ ఇచ్చింది. కానీ, పైలట్ మాత్రం విమానాన్ని టేకాఫ్ చేసేందుకు నిరాకరించాడు. డ్యూటీ సమయం పరిమితులు, పనిగంటలను కారణంగా చూపి తాను విమానాన్ని నడపబోనని పట్టుబట్టాడు. దీంతో దాదాపు 350 మంది ప్రయాణికులు జైపుర్ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయారు. వీరిని గమ్యస్థానానికి చేర్చేందుకు ఎయిరిండియా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మూడు గంటల పాటు ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో కొందరు రోడ్డు మార్గంలో దిల్లీ వెళ్లిపోయారు. ఆ అవకాశం లేనివారు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరకు ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయడంతో కొన్ని గంటల తర్వాత విమానం తిరిగి దిల్లీ చేరుకుంది. జైపుర్‌లో తాము ఇబ్బందులు పడుతున్న దృశ్యాలను కొందరు ప్రయాణికులు వీడియో తీసి సోషల్‌మీడియాలో షేర్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. అయితే, ఈ ఘటనపై ఎయిరిండియా స్పందించలేదు.




# 25మందికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను తప్పించబోయి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహ వేడుకకు హైదరాబాద్ వెళ్లిన బస్సు రామగుండం తిరుగు పయనమైంది. ఈ క్రమంలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్దకు రాగానే ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 70మంది ఉన్నారు. ఇందులో 25 మందికి తీవ్రగాయాలు కాగా.. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ మహేశ్, సీఐ జగదీశ్, పోలీసు సిబ్బంది పరిశీలించారు. క్షతగాత్రులను సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

# తెలంగాణలో 3,500 కోట్ల పెట్టుబడులు: లులూ గ్రూప్ ఛైర్మన్




హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మరో సంస్థ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రూ. 3,500 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు లులూ గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీ వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ సమక్షంలో పెట్టుబడుల కార్యాచరణను ప్రకటించారు. ఇప్పటికే రూ. 300 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో షాపింగ్ మాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో షాపింగ్ మాల్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే లులూ మాల్‌కు సంబంధించి 80శాతం పనులు పూర్తి అయ్యాయని వెల్లడించారు.

**అన్ని రంగాల్లోనూ దూసుకెళ్తున్నాం: కేటీఆర్ –** ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద షాపింగ్ మాల్స్‌లో ఒకటైన లులూ గ్రూప్ సంస్థ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు.

లులూ సంస్థ పెట్టుబడులతో తెలంగాణ టూరిజం పెరుగుతుందని భావిస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి సంస్థలతోపాటు తెలంగాణ కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణలోనే ఉందని తెలిపారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రం దూసుకెళ్తోందన్నారు.

# రైతు బంధు పండుగ మొదలైంది : మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ రైతు బంధు పండుగ మొదలైనట్లు మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఈ మేరకు ఇవాళ ఆయన తన ట్విట్టర్‌లో స్పందించారు. రైతు బంధు స్కీమ్ కింద తెలంగాణ రైతులకు పెట్టుబడిగా ఇస్తున్న మద్దతు లక్షలాది మంది రైతులకు నేటి నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఆయన తెలిపారు. పదకొండవ విడుత రైతు బంధు ప్రారంభమైన సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. రైతుల అభివృద్ధి, శ్రేయస్సే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఇవాళ తొలి రోజు సందర్భంగా 645.52 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లోకి క్రెడిట్ చేస్తున్నట్లు మంత్రి హరీశ్ వెల్లడించారు. జూన్ 26వ తేదీ రోజున సుమారు 22,55,081 మంది రైతులకు రైతు బంధు అందినట్లు ఆయన చెప్పారు.

**సుతి లేని బిజెపి.. మతి లేని కాంగ్రెస్.!** ధరణి పోర్టల్ విషయంలో బీజేపీ వైఖరిని మంత్రి హరీశ్ రావు ఖండించారు. ఆ పార్టీది పూటకో మాట, నోటికో మాట అన్న ఉందన్నారు. ఇవాళ ట్విట్టర్‌లో మంత్రి హరీశ్ స్పందిస్తూ.. గల్లీ బీజేపీ నాయకులు ఒకటి చెప్తే, ఢిల్లీ నాయకులు ఇంకొకటి చెప్తున్నారని విమర్శించారు. ధరణిని రద్దు చేయబోమని మొన్న రాష్ట్ర నాయకులు అంటే, రద్దు చేస్తామని నిన్న నడ్డా అన్నట్లు మంత్రి హరీశ్ పేర్కొన్నారు. బీజేపీ రెండు నాలుకల ధోరణికి ఇది మరొక నిదర్శనమన్నారు. బీజేపీ పార్టీలో నేతల మధ్య సుతి కలవదు, ఒకరి మాట మరొకరు వినరు అని హరీశ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ధరణి గురించి ఏమాత్రం అవగాహన లేకుండా, గుడ్డిగా విమర్శించడమే పనిగా పెట్టుకున్నాట్లు మంత్రి తెలిపారు.

# ఉప్పల్‌లో కేటీఆర్‌కు నిరసన సెగ...



హైదరాబాద్: ఉప్పల్ రింగ్ రోడ్డులో బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఉప్పల్ పర్యటనకువచ్చిన మంత్రి కేటీఆర్ గో బ్యాక్.. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దాంతో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తోపాటు పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్ అభివృద్ధి కోసం రావడంలేదని వ్యాపారం చేయడానికి మాత్రమే వస్తున్నారని ప్రభాకర్ ఆరోపించారు. రామంతపూర్‌ను దత్తత తీసుకుంటామని చెప్పి.. ఈ ప్రాంతంలోని భూగర్భ డ్రైనేజ్ పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు. ఏ ఒక్క పేదవాడికి న్యాయం జరగలేదని, దళితబంధు ఇవ్వాలంటే లంచం అడుగుతున్నారని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ ఉప్పల్ పర్యటనలో నిరసన సెగ తగిలింది. ఆయన పర్యటనను నిరసిస్తూ బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన స్కైవాక్ ప్రారంభోత్సవానికి మంత్రి వచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ఆందోళనకు దిగారు. కేటీఆర్ పర్యటనను వ్యతిరేకిస్తూ బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు బీజేపీ నేతలను అరెస్టు చేసి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com